ENTERED

హ్యాపీబర్త్‌డే

(2011 ఏప్రిల్ 10 నుంచి
2011 ఏప్రిల్ 16 వరకు)

ఎన్. అభినందన్
1సం॥, ఏప్రిల్-12
అలివేలు-యాదగిరి
భట్టుపల్లి-ఆదిలాబాద్

ఎన్. వెంకట నాగదుర్గ
6సం॥, ఏప్రిల్-2005
చిన్నకోటేశ్వరి-శేషు
మార్కాపురం-ప్రకాశం

యజ్ఞశ్రీ
6సం॥, ఏప్రిల్-10
శిరీష-లక్ష్మయ్య
ఓం శాంతినగర్-కడప

ఎం. సుశాంత్
1సం॥,ఏప్రిల్-2010
అపర్ణ-శ్రీనివాస్
మార్టూర్-ప్రకాశం

ఎం.దుర్గాప్రసాద్ (పొట్టి)
ఏప్రిల్-19
అనిత-గోపాల్
మెదక్

బి.సూర్యతేజ
10సం॥, ఏప్రిల్-13
లక్ష్మి-యాదగిరి
నస్రుల్లాబాద్-నిజామాబాద్

కె.పి.శ్రీకృష్ణ సమీరజ్
2సం॥, ఏప్రిల్-12
నాగజ్యోతి-రామిరెడ్డి
చిలమత్తూరు-అనంతపురం

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కలర్ ఫొటో జత చేయడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email-
venkateshcartoon@gmail.com

మనలో మాట

బల్బు పోయి బుద్ధి వచ్చె ధాం.. ధాం.. ధాం..



అసలే వేసవి. ఆపై ఉక్కపోత. ఇవి చాలవన్నట్టు మంచినీళ్ల కటకట. అన్నిటినీ మించి సర్కారువారి కరెంటు కోత. ఇంట్లో వుండా లేము. కాలు బయట పెట్టా లేము. లోపలుంటే చెమటలు. బయటికెళితే మండుటెండలు. మొరాయించిన పంకా రెక్కలు, మూతి బిడాయించుకున్న నల్లాలు. మంచినీళ్ల కోసం మండుటెండల్లో బారులు. ముష్టి యుద్ధాలు. మాటల బాణాలు. కరెంటు కోతకు, దోమల స్వైర విహారం తోడైతే! అర్ధరాత్రి జాగారాలు, దోమల వేటలు. వేసవి తెచ్చే మామిడి ఎంత మధురం. కరెంటు కోత అంత కఠినం.

'ప్రాణం పోకడ వాన రాకడ చెప్పలేం' అన్నది పాత మాట. కరెంటు పోకడ రాకడ చెప్పలేమన్నది నేటి మాట. కరెంటు ఏ క్షణంలోనైనా పోవచ్చు. ఎన్ని గంటల తర్వాతైనా రావచ్చు. దానికి సమయం సందర్భం...నీతి న్యాయం ఏమీ వుండదు. అది మిట్ట మధ్యాహ్నమా...అర్ధరాత్రా అన్న మొహమాటాలేం వుండవు. పసిపిల్లలు, ముసలివాళ్లు అన్న కనికరం అస్సలు వుండదు. చిన్నారులు కాసేపు నిద్రపోతే పనిపూర్తి చేసుకుందామనుకునే తల్లులకు నిరాశే. పగలంతా పనిపాటలు చేసి అలసిసొలసి కంటినిండా నిద్ర పోదామనుకోవడం అత్యాసే!

పరీక్షల సీజన్లో పవర్ కట్టంటే పిల్లకాయలకు ఎంత కష్టం? ప్రాణవాయువు అందనట్టు గిలగిలలాడిపోతారు. టెన్త్, ఇంటర్ పరీక్షలు ఎలాగో పూర్తయినా డిగ్రీ, పీజీ, పోటీ పరీక్షలు వుండనే వున్నాయి. కరెంటు కోతతో చేలో పైరే కాదు రైతు మొహమూ వాడిపోతోంది. కరెంటు రాదు. పైరుకు నీరందదు. రైతుకు కన్నీరాగదు. ఓల్టేజీ సమస్యలతో మోటార్లు...ఫ్యాన్లు కాలిపోతోంటే...బల్బులు మాడిపోతున్నాయి. పవర్ హాలిడేలు ప్రసాదించే ఉపవాసాలతో కార్మికుల కడుపులు కాలిపోతున్నాయి.

మిక్సీలు, గ్రైండర్లు అలవాటై రోళ్లను మూలన పడేశాం. ఇప్పుడు కరెంటు కోత కారణంగా రుబ్బురోళ్లతో కుస్తీపట్లు. అత్త మీది కోపం దుత్త మీద చూపించినట్టు... కరెంటు మీది కోపం పచ్చడిబండ మీద చూయిస్తే... అది ఊరుకుంటుందా! చప్పన చింది కంట్లో పడుతుందిసుమా జాగ్రత్త.

ఈ ఏడు వానలు మస్తు. రిజర్వాయర్లు ఫుల్లు. అయినా వేసవిలో గుండెజల్లు. కరెంటు ప్రయివేటీకరణతో మనం సాధించిందేమిటంటే...

మిక్సీ పోయి రోలు వచ్చె ధాం...ధాం...ధాం...
ఫ్యాను పోయి విసనకర్ర వచ్చె ధాం...ధాం...ధాం...
బల్బు పోయి బుద్ధి వచ్చె ధాం..ధాం..ధాం...
పని పోయి పస్తులొచ్చె ధాం...ధాం... ధాం...

★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	6
నవ్వుల్ పువ్వుల్	...	7
సినిమా కబుర్లు	...	8
రుచి	...	10
కొత్త పుస్తకాలు	...	11
అట్టమీది కథ	...	14
కథ	...	18
తెల్సా	...	21
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

శివుడే పతి... భిక్షాటనే వృత్తి...! ... 4

చూద్దామా ... 12

పల్లెకు పోదాం... ఛలో... ఛలో...

వికాసం ... 20

మీరు... మీ నిద్ర...



అలరించిన 'సూపర్‌మూన్'

ఈ వారం సూపర్‌మూన్ విశేషాలు అలరించాయి. ఈ నాటికీ సౌరకుటుంబంలోని ఎన్నో విషయాలు పూర్తిగా తెలియవు. అయితే వీటిపై వచ్చే పుకార్లు మాత్రం చాలా త్వరగా వ్యాపిస్తున్నాయి.

నూతి నారాయణ రావు,
గడ్డిఅన్నారం.

మురిపించే 'హ్యాపీబర్త్‌డే'

ఈవారం స్నేహలో 'వెబ్‌డబ్' అంటూ విస్తరిస్తున్న వెబ్ డిజైనింగ్ గురించి చాలా చక్కగా వివరించారు. దీని గురించి చాలామందికి అంత అవగాహన లేదు. అలాంటి వారందరికీ ఈ వ్యాసం ఎంతో ఉపయోగంగా ఉంది. 'వికాసం'లో శర్మగారు స్కానింగ్ గురించిన ఎన్నో తెలియని విషయాలు తెలియజేశారు. 'సశేషం' కవిత బాగుంది. 'హ్యాపీబర్త్‌డే' లో ఎంతోమంది తల్లిదండ్రులు తమ పిల్లల ఫొటోలు చూసుకుని మురిసిపోతున్నారు. 'వధువు కావలెను' కామెంట్ ఆసక్తికరంగా ఉంది. చక్కని శీర్షికలతో పాఠకుల హృదయాలను ఆకట్టుకుంటున్న స్నేహకి అభినందనలు.

జటంగి కృష్ణ, రాజాపురం.

మానవ సంబంధాల అంతర్మథనం

'**అట్టమీది కథ**' వెబ్‌డబ్ అంతర్జాలంలోని అపురూపమైన సమాచారాన్ని అందించింది. 'టెడ్డీబేర్ మ్యూజియం' విశేషాలు బావున్నాయి. 'సినిమా కబుర్ల' ద్వారా వెలుగులోకి రాని అనేక విషయాలు తెలుస్తున్నాయి. 'ఎండల్లో హాయ్... హాయ్...' రచన ప్రయోజనకరంగా ఉంది. స్కానింగ్ మీద అవగాహన కలిగించిన సర్వేశ్వరశర్మకి అభినందనలు. కొత్త పుస్తకంలోని 'చిరస్మరణ' నిరంతరం స్మరించుకోదగిన పుస్తకమని అర్థమైంది. 'మాటలకోట' ద్వారా పద సంపదని పెంచుకుంటున్నాం. చిత్ర విచిత్రాలతో తెల్సా పేజీ ఆకర్షిస్తోంది. డా॥విజయ్ అందించిన సూపర్‌మూన్ పుట్టు పూర్వోత్తరాల విశ్లేషణ బావుంది. రాతిమనిషి కథ ఆసక్తికరంగా ఉంది. చివరి పేజీలో కె.సాహిల్ అందించిన ధారావాహిక కథ బాగుంది. మనలో మాట మానవసంబంధాల అంతర్మథనాన్ని తెలియజేస్తుంది.

నేమాన సుభాష్‌చంద్రబోస్,
శ్రీకాకుళం.

నిజంగా ఉన్నారా?

అట్టమీదికథ 'మరణమే శరణమైతే...' సందర్భోచితంగా ఉంది. కారుణ్య మరణమనేది ప్రపంచ ప్రజల సమస్య. అతి సున్నితమైనదీనూ. చట్టం చేసే ముందు దేశ, కాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. కారుణ్యమరణాన్ని అమలు చేస్తున్న దేశాల్లోని పరిస్థితులను, ఫలితాలను కూలంకషంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. కారుణ్య మరణం చట్టం చేయాల్సి వస్తే అది స్వార్థపరుల, అమాయకుల, ఆస్తి కాముకుల చేతిలో పడి, అమాయకుల ప్రాణాలను బలిగొనకుండా కట్టుదిట్టమైన కవచాలు కల్గి ఉండేట్లు జాగ్రత్త పడాలి. అరుణా రామచంద్ర శాన్‌బాగ్ ఉదంతంలో భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు మానవత్వానికి పెద్ద పీట వేసింది. అయినప్పటికీ భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు రాకుండా, డాక్టర్లు, లాయర్లు వివిధ సామాజిక మేధావులతో విస్తృతమైన చర్చలు, పరిశీలన చేయాలి. అనంతరం కారుణ్య మరణ చట్టంపై ఒక తుది నిర్ణయానికి రావాలి. బిచ్చగాడు కథ వాస్తవాన్ని ఆధారంగా



చేసుకుని రాశారో లేదా అలా ఉంటే బాగుండేదని రాశారో కానీ బిచ్చగాళ్లలో పెద్దయ్య వంటి వారు... రైల్వే అధికారుల్లో మంచిర్యాల రైల్వే అధికారుల వంటివారు నిజంగానే ఉంటే ఎంత బాగుండనిపిస్తుంది.

ఖైరి సత్యనారాయణ, కొత్తగూడెం.

లోతైన మనిషి

వేసవిలో ఆరోగ్యానికి మెళకువలు బాగున్నాయి. పక్షులే కనిపించని పరిస్థితి వచ్చినా పట్టించుకునే నాథుడే లేడు కదా. మైనా కథ బాగుంది. అంతర్జాలంలో విశేషాలు బాగున్నాయి. జగ్గు రాతి మనిషా? లోతైన మనిషా? సిగరెట్లతో సింగర్ చిత్రం సహజంగా ఉంది. 'టెడ్డీబేర్ మ్యూజియం' ఆకట్టుకుంది.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్.

★





SPEAK ENGLISH FLUENTLY

లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...

ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు



K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...

సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

☞ ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:

CHENNAI:

0-9789099589

హలో: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE TM

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....Pin Code: ______

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside: Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:** 9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near: Telephone Exchange. **Ph:** 228800, **Cell:** 9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex, D.I.Road, **Ph:** 232502. **Cell:** 98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:** 93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:** 99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:** 93904 95239, 99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:** 93473 53709, 92900 91456.

'అందరిలాగే నాకూ చదువుకోవాలని ఉంది. తోటి పిల్లలు బడికి వెళ్తుంటే మా అమ్మానాన్నలు నన్ను బడి మాన్పించారు. నేను దేవుడి మనిషినంట. ఆ మాట చెప్పేసి నన్ను వదిలి వెళ్లిపోయారు. అడుక్కుని కడుపు నింపుకోవాలని చెప్పారు. నాకైతే ఏడుపొస్తోంది. ఏం చేయాలో తెల్వది'.

శివుడే పతి... భిక్షాటనే వృత్తి...!

ఇదీ వరంగల్ జిల్లాకు చెందిన పన్నెండేళ్ల చిన్నారి స్వప్న మనోగతం. ఇదో ఉదాహరణ మాత్రమే. ప్రతి ఏటా ఇలాంటి వెయ్యి మంది చిన్నారుల జీవితాలు మూఢాచారాలకు బలవుతున్నాయి. మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో బసవి, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో జోగిని, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో శివపార్వతుల పేర ఈ తతంగం సాగుతోంది. పేరు ఏదైనా బాధ ఒక్కటే. బడికి పంపాల్సిన వయసులో మొక్కుబడుల పేర అమాయకులైన చిన్నారుల జీవితాలను బలిచేస్తున్నారు. ఈ సాంప్రదాయం అనాదిగా సాగుతున్నా పట్టించుకునే వారే లేరు. అందువల్ల ఇప్పటికీ మూడు ధారణలు, ఆరు శివపార్వతులుగా విరాజిల్లుతోంది. ఈ నేపథ్యంలో శ్రీరామనవమి సందర్భంగా 'ప్రజాశక్తి' అందిస్తున్న ప్రత్యేక కథనం...

ప్రతి ఆలయంలో మొక్కుబడులు సహజం. ఆయా ప్రాంతం, దేవుడికి ప్రీతిపాత్రమని నమ్ముతున్న వాటిని సమర్పించుకోవడం సాంప్రదాయంగా వస్తోంది. ఇదే కోవలో కరీంనగర్ జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో కోడె దూడలను మొక్కుబడులుగా చెల్లిస్తారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు, సంతానం కావాలనుకున్న వారు, పిల్లలు దక్కని వారు కోడె దూడ మొక్కు చెల్లిస్తామని మొక్కుకుంటారు. వారి కోరిక నెరవేరితే మొక్కు చెల్లిస్తారు. శివుడికి నంది వాహనం కావడంతో ఈ కోడె మొక్కుబడి ఇక్కడ సాంప్రదాయంగా మారింది. స్వయంగా కోడె ఉన్న యజమానులు నేరుగా తమ కోడెను సమర్పించుకుంటారు. లేని వారు అద్దె కోడె టికెట్‌తో సమర్పించుకుంటారు (వంద రూపాయలు ఇచ్చి కోడె దూడను అద్దెకు తీసుకొని గుడి చుట్టూ తిప్పి మొక్కు తీర్చుకుంటారు). అంత వరకు బాగానే ఉంది. ఇక్కడ కోడెలతోపాటు మనుషులను సైతం మొక్కుబడిగా చెల్లించే మూఢాచారం అనాదిగా వస్తోంది. తమ కోర్కెలు నెరవేరితే తమ పిల్లల్లో ఒకరిని దేవుడి పేర సమర్పించుకోవడం ఒక ఆచారంగా మారింది. ఇందులో ముక్కుపచ్చలారని చిన్నారులు, మైనార్టీ తీరని వారే ఎక్కువ. అందులోనూ బాలురు ఉన్నప్పటికీ బాలికల సంఖ్యే అధికం. వీరంతా చదువుసంధ్యలు మానేసి దేవుడి పేర భిక్షాటన చేసి జీవించడమే వృత్తిగా స్వీకరించక తప్పదు. వాస్తవానికి ప్రచార సాధనాలు లేని సమయంలో ఈ వ్యవస్థ ప్రారంభమైనట్లు తెలుస్తోంది. దేవుడి పేర వదిలేసిన వారిని శివపార్వతులుగా పిలుస్తారు. వారంతా ఇంటింటా, ఊరూరా తిరిగి 'వేములవాడ పార్వతీ రాజరాజేశ్వర స్వామి భిక్షం' అంటూ భిక్షాటన సాగిస్తూ జీవితం గడుపుతారు. సాధారణంగా ఈ వ్యవస్థలో వారికి పెళ్లిళ్లు చేసుకొనే అవకాశం లేకపోయినా పెరిగి పెద్దయిన తరువాత వారిలోనే ఇష్టపడిన ఆడామగ పెళ్లిళ్లు చేసుకుంటున్న విధానం కొంతకాలం క్రితమే ప్రారంభమైంది.



అధికారుల సాక్షిగా..

చిన్నారులను శివపార్వతులుగా మార్చే 'ధారణ' తతంగంతోపాటు శ్రీరామనవమి రోజున

తమ పెళ్లిళ్లను మరోసారి చేసుకునే తతంగం అధికారుల సాక్షిగానే సాగుతోంది. ఎక్కడో ఎవరికీ తెలియకుండా మారుమూలన సాగడం లేదు. ధారణ కార్యక్రమమంతా జంగమ పూజారుల ఇళ్లలో, పట్టణం నడిబొడ్డున సాగుతుంది. శివపార్వతులుగా మారిన వారు సైతం తిరిగి పెళ్లిళ్లు ఏకంగా ఆలయ పరిధిలోనే చేసుకోవడం గమనార్హం. శ్రీరామనవమి సందర్భంగా ఆ ఉత్సవాలకు రెవెన్యూ అధికారులతోపాటు పోలీసు అధికారులు సైతం హాజరవుతారు. అందులోనూ ప్రస్తుతం ఆలయ ఇ.ఓగా ఏకంగా డిఆర్‌ఓ స్థాయి గల రెవెన్యూ అధికారి డిప్యుటేషన్‌పై పనిచేయడం విశేషం. ఆయనతోపాటు సిరిసిల్ల ఆర్‌డిఓ, డిఎస్‌పి, వేములవాడ తహశీల్దార్, సిఐ, ఎస్‌ఐలు కూడా హాజరవుతారు. ఈ తతంగాన్ని చూసీ చూడనట్లు వదిలేస్తుంటారు.

భిక్షాటన..

భిక్షాటనే వృత్తిగా సాగుతున్న శివపార్వతులకు 1985లో పెద్ద సమస్య వచ్చిపడింది. అప్పటి ఆలయ కార్యనిర్వహణాధికారి ఆలయ పరిధిలో భిక్షాటనను నిషేధించారు. దీంతో వారంతా పోరు బాట పట్టారు. ఏకంగా మూకుమ్మడి నిరాహార దీక్షలకు దిగారు. దీంతో దిగొచ్చిన ప్రభుత్వం స్వయం ఉపాధి కింద వారికి బ్యాంక్ రుణాలు ఇప్పించింది. గృహ నిర్మాణ పథకం కింద కమాన్ వద్ద గృహ నిర్మాణాలు పూర్తి చేసింది. కాకపోతే అవన్నీ తూతూ మంత్రంగా సాగాయి. కొంత మేరకు రుణాలు తీసుకున్నా వ్యాపార మెలకువలు తెలియక నష్టపోయిన వారున్నారు. దీంతో తిరిగి భిక్షాటన వైపు మొగ్గు చూపక తప్పలేదు. రేగడి నేలలో నిర్మించిన వంద గృహాలు కుంగిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిలో జీవించడమే కష్టంగా తయారైంది. పైగా అక్కడి నుండి వేములవాడకు వెళ్లాలంటే రాను పోనూ 8 కిలోమీటర్ల ప్రయాణం తప్పదు. ప్రయాణానికి డబ్బులు లేకపోవడంతో కాలినడకనే గమ్యం చేరుతున్నారు.



శిథిలావస్థలో శివపార్వతుల కాలనీ

ప్రతిఏటా...

సాధారణంగా దేవుడి పెళ్లి అంటే దేశమంతా ప్రచారంలో ఉంది శ్రీరామనవమి మాత్రమే. అందువల్ల శివుడిని భర్తగా స్వీకరించిన శివపార్వతులు సైతం ప్రతి శ్రీరామనవమికీ ప్రతి ఏటా మరోసారి శివుడిని మనువాడినట్లుగా భావిస్తారు. ఇందులో భాగంగానే పెళ్లి కూతురిలా ముస్తాబైన శివపార్వతులే ఒకరి తలపై మరొకరు జీలకర్ర బెల్లం పెట్టుకొని తలంబ్రాలు పోసుకుంటారు. హరిహర క్షేత్రమైన వేములవాడలో శివరాత్రితోపాటు శ్రీరామనవమి వేడుకలు కూడా అదే స్థాయిలో జరుగుతుంటాయి. అందువల్ల ప్రతిఏటా రెండు నుండి మూడు లక్షల మంది యాత్రికులు ఈ వేడుకలకు హాజరవుతారు. అందులో లక్ష మంది శివపార్వతులే కావడం గమనార్హం. పైగా మంచి ముహూర్తంగా భావించడంతో అదే సమయానికి కొత్తగా ఈ వ్యవస్థలో చేర్చదలుచుకున్న పిల్లలను 'ధారణ' పేర ముడిపెడతారు. వేములవాడలో ధారణ పేర 30 మంది పూజారులు ఇదే వృత్తిగా స్వీకరించి జీవనం సాగిస్తున్నారు. దీన్ని బట్టి ఈ వ్యవస్థ ఎంత బలంగా వేళ్లూనుకొని విస్తరిస్తుందో ఊహించవచ్చు. ధారణ ద్వారా శివపార్వతులుగా మార్చిన పిల్లలకు మెడలో రుద్రాక్ష వేసి చేతిలో త్రిశూలం ధరింపజేస్తారు. నుదుట రూపాయి బిళ్లంత బొట్టుతో విచిత్ర వేషధారణతో కన్పించే వీరంతా భిక్షాటనే వృత్తిగా జీవితం గడుపుతారు.

దళిత గిరిజనులే బలి..

ఈ దురాచారానికి దళిత, గిరిజనులే బలవుతున్నారు. కొంత కాలం క్రితం వరకు వెనకబడిన తరగతులకు చెందిన వారు కూడా దీనిని ఆచరించారు. చదువు, నాగరికత పెరిగిన నేపథ్యంలో ఒక్కొక్కరుగా ఈ వ్యవస్థకు దూరమయ్యారు. ప్రస్తుతం నిరక్షరాస్యత, ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురవుతున్న దళిత, గిరిజనులు మాత్రం దాన్ని వీడలేదు. ప్రభుత్వం ఈ అనాచారాన్ని రూపుమాపకపోగా చూసీ చూడనట్లు వ్యవహరిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ధారణ జరుగుతున్న చోట పోలీసులు దాడులు చేసి అరెస్టు చేసి కొన్ని గంటల అనంతరం వదిలేస్తున్నారు. దాంతో ఈ తతంగం నిరాఘాటంగా సాగుతూనే వుంది.

-పి.ఎస్ రవీంద్ర, కరీంనగర్

తిరిగి తొంగి చూడలా

దేవుడి పేర వదిలేశాక నా అన్న వాళ్లు తిరిగి తొంగిచూసింది లేదు. రోగాలొచ్చినా...రొష్టులొచ్చినా... చేతిలో పైసా వున్నా లేకున్నా...పట్టించుకునే దిక్కే లేదు. మా బాధలు మేం అనుభవించాల్సిందే. మేమున్నామనే ధైర్యం ఇచ్చేవారు లేరు.

- బండారు చొక్కయ్య

ఏవీ లేవు

మాకు ఏ పింఛన్లూ లేవు. ఏ కార్డులూ లేవు. ఓట్ల పండగనాడు వచ్చేవారేగానీ... బాగోగులు పట్టించుకునే వారే లేరు.

- మల్లెపల్లి గంగయ్య

కడుపు నిండా దు:ఖం.. కంటి నిండా నీరే

ఏం చెప్పమంటారయ్యా! కడుపు చించుకుంటే కాళ్లమీదపడినట్లు ఉంది. కడుపు నిండా దు:ఖం.. కంటినిండా నీరే మిగిలింది. చెప్పుకోడానికి ఏమీ మిగల్లేదు.

- అల్లం సత్తమ్మ

గుడిమెట్లను నమ్ముకున్నాం

గుడిమెట్లను నమ్ముకొన్నాం. ఇదిగో ఇలా చెయ్యి జాపి రోజులు గడుపుతున్నాం. మా కాలనీ నుండి రానుపోనూ 8 కిలో మీటర్లు నడవాలి. తాగడానికి నీళ్లూ కరువే. ఇళ్లు కూలిపోతున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నని చెప్పాలి బాబూ.

- తాళ్లపల్లి వజ్రమ్మ

ఎవరు దిక్కు?



చరిత్ర హీనులు
ధరిత్రి లోన
పవిత్ర కార్యం
భగ్నం చేస్తూ
ధన దాహం
తీరని మోహం
అందలమెక్కిన
దురహంకారం
మోసపు ముసుగు
పన్నుతుంటే
ఎవరు దిక్కు?
అమ్మ కడుపులో
నెత్తురు ముద్ద
బాల్య జీవితం
రాయని సుద్ద
మురికి వాడలో
మునిగే వారికి
చేయూత అందని
నిర్భాగ్యులకు
ఎవరు దిక్కు?
మెత్తగ బతికి
చిత్తుగ ఓడి
మత్తుకు లోనై
నెత్తురు ఇంకి
సత్తువ కుంగి
మూడు పదులకే
మూల్గుతూ పలికే
బలహీనులకు
ఎవరు దిక్కు?
సమస్యలతో
సతమతమవుతు
సహాయం కోసం
సాగిల పడి
చేయి చాచినా
ఉపాధి లేని
ఊపిరాడని
సగటు మనిషికి
ఎవరు దిక్కు?
కూటికి లేక
నోటికి పడక
సాటి మనిషికి
లోకువ కాగా
అవమానంతో
క్రుంగి కృశించి
చతికిల పడే
నిస్సహాయులకు
ఎవరు దిక్కు?
పేదతనమే ప్రణం
బలహీనతే మరణం
తెగింపు లేనిది
ముగింపు కాదది.

- కూచిపూడి వెంకటేశ్వర్లు

కవిత్వమ్

శిల్పం జన్మించాలి

వేర్పాటుగా ఉంది
దౌష్ట్యంగా ఉంది
దోపిడీగా ఉంది!
మూగకూ మాట ఉంది
బధిరుడికీ మాట ఉంది
అంధుడికీ మాట ఉంది
బహిర్గతం ఒకటి
అంతర్గతం ఒకటి!
మాట వరుస మారింది
గీటు దాటింది
లయ తప్పింది
ఊపిరి పొయ్యాల్సిన మాట
ఉసురు తీస్తూ వుంది
శుభమస్తు అనాల్సిన మాట
విఘ్నమస్తు అంటూంది!
గోవు వ్యాఘ్రమైంది
రామచిలుక రాబందైంది
అమ్మ నేర్పిన మాట అపస్వరమైంది



గురువు నేర్పిన మాట గాడి తప్పింది
మాట మనిషి స్వరధ్వని
మాట మనిషి ప్రతిధ్వని
మనిషి వేరు కాదు
మాట వేరు కాదు!
సముద్రపు మూగ వ్యాకరణాన్ని
మాట అభ్యసించటం లేదు
నిశ్శబ్ద మేఘమాలికల వాచకాన్ని
మాట పఠించడం లేదు
శ్రీరాముడు మాట్లాడాడు
రామరాజ్యం విలసిల్లింది
బుద్ధుడు మాట్లాడాడు
కరుణ కురిసింది
మహాత్ముడు మాట్లాడాడు
అహింస ఆవిర్భవించింది!
మాట ఉలి
మనిషి శిల్పి
శిల్పి శిల్పించాలి
శిల్పం జన్మించాలి!

-అడిగోపుల వెంకటరత్నం



మిథ్యాబింబం

వార పత్రిక
ఇలా కొంటానో లేదో
మనసంతా రాశిఫలాల మీదికి
దూసుకుపోతుంది
కథ, కవిత, కార్టూన్, కథనం
ఇవన్నీ నాకు రెండో ప్రాధాన్యాలే!
ఆ వారంలో జాతక చక్రం
రాశిఫలాల్లో రాసినట్లు
అక్షరాలా తిరిగి పోతుందని
ఖచ్చితంగా జరిగి పోతుందని
అర్ధశతాబ్దం నుండి
ఎదురు చూస్తూనే ఉన్నాను!
నేటికీ రాశిఫలాల ఫలితం
అనుభవానికొచ్చిన దాఖలాల్లేవు!
మచ్చుకైనా జరిగిన రుజువుల్లేవు!
అయినా సరే...
ఇప్పటికీ వాటిని
మొదటి ప్రాధాన్యంగా
చకోర పక్షినై చూస్తూనే ఉన్నాను
అలవాటు పడిపోయిన
ఆశాజీవిగా....
నిట్టూర్పులకు నెలవైన
ఉదాసీన జీవిగా....!

- పి. లక్ష్మణ్‌రావు



నవ్వుల్ - పువ్వుల్

ఇది అంతే!



టీచర్ : గణేష్ నిన్న నీకు ఒక పద్యం చెప్పానుగా. చదివావా?

గణేష్ : నిన్న తిన్న అన్నం కడుపులో ఉంటుందా టీచర్? ఇదీ అంతే!

ఇప్పుడే

టీచర్ : పిల్లలూ! గాంధీ పేరు విన్నారా?

పిల్లలు : విన్నాము టీచర్.

టీచర్ : ఎప్పుడు?

పిల్లలు : ఇప్పుడే.

తెలియదు

టీచర్ : రామూ ప్రపంచంలో అతి పెద్ద ఖండం ఏది?

రాము : తెలియదు టీచర్

టీచర్ : అంతపెద్ద ఖండం గుర్తుండకపోతే ఎలా?

రాము : అంత పెద్ద ఖండం నా బుర్రలో ఎలా సరిపోతుంది. అందుకే తెలియదు.

అంత టైమా?

న్యాయమూర్తి : నవ్వు నెమలిని చంపినందుకు నీకు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తున్నాను.

ముద్దాయి : అంత టైమ్ ఎందుకు సార్? నాతోపాటు 180 మందిమి ఒక్కరోజు జైల్లో ఉంటాం.

న్యాయమూర్తి : అదెలా?

ముద్దాయి : ఆరు నెలలకు 180 రోజులు కదా సార్.

తిరిగిరా

బిచ్చగాడు: బాబూ ధర్మం చేయండి

బాబు : చెయ్యి ఖాళీ లేదుగానీ... తిరిగిరా

బిచ్చగాడు: (తన చుట్టూ తాను తిరిగి) ధర్మం చేయండి బాబూ

ఎవరు?

టీచర్ : తాజ్‌మహల్‌ని ఎవరు కట్టారు?

యాదవ్ : మేస్త్రీలు టీచర్.

ఆర్.పంచారామ్, ఊట్‌పల్లి, బోధన్.

బ్రెయిన్

(ఓ సైన్సు విద్యార్థి మెదడు మీద అధ్యయనం చేయాల్సి వచ్చింది. మెదడు కొనుక్కు రావడానికి షాపుకెళ్లాడు)

విద్యార్థి: ఇంజనీర్ మెదడు ఔన్సు ధర ఎంత?

షాపువాడు: మూడు డాలర్లు

విద్యార్థి: కంప్యూటర్ ప్రోగ్రామర్ మెదడు ఔన్సు ఎంత?

షాపువాడు: నాలుగు డాలర్లు

విద్యార్థి: లాయర్ మెదడు ఔన్సు ఎంత?

షాపువాడు: వెయ్యి డాలర్లు.

విద్యార్థి: అతని మెదడు అంత ఎక్కువ ధర చెప్తున్నారెందుకు?

షాపువాడు: మరి ఔన్సు మెదడు కావాలంటే ఎంత మంది లాయర్లను ఖతం చేయాలో ఆలోచించు.

ఫీజు

(ఓసారి అడవిలో ఆహారం వెతుకుతున్న రెండుపిచ్చుకలకు గొడవౌతుంది)

1వ పిచ్చుక: హేయ్... అక్కడ చూడు. బరాణీ గింజ వుంది!

2వ పిచ్చుక: (రయ్యిమని ఎగురుకుంటూ వెళ్లి అక్కడ వాలి) ఆ..ఇది నాది.

1వ పిచ్చుక: నేను ముందు చూశా కాబట్టి అది నాది.

2వ పిచ్చుక: నేను ముందు తీసుకున్నా కాబట్టి అది నాది

లాయర్‌పిచ్చుక: ఆగండ్రా...ఎందుకు పోట్లాడుకుంటారు. ఏదో ఒక పరిష్కారం ఆలోచిద్దాం.(అంటూ బరాణీ గింజను రెండు భాగాలు చేసి పిచ్చుకలకు ఇస్తుంది. తర్వాత...)
మరి నా ఫీజు గా ఏమిస్తారు?
రెండు పిచ్చుకలూ ఒకేసారి: ఏంటీ...బరాణీ గింజను పంచి ఇచ్చినందుకు ఫీజా?

లాయర్ పిచ్చుక: అవును. ఆ మాంసం తీసుకుంటాలే.

ఎప్పటినుంచి

రోగి: డాక్టర్! ఈ మధ్య నేను కుక్కనేమో అన్న భావన కలుగుతోంది.

డాక్టర్: ఎప్పటినుంచి?

రోగి: కుక్కపిల్లగా వున్నప్పటినుంచి

రెండు

రోగి: నాకు ప్రతిదీ రెండుగా కనిపిస్తోంది డాక్టర్.

డాక్టర్: ముందు కూర్చోండి.

రోగి: ఏ కుర్చీలో డాక్టర్?

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

సినిమా కబుర్లు

నిత్యనూతన వాచికాభినయ వరప్రసాద్

నటులు చాలా మంది ఉంటారు. కానీ, ఆంగికం, వాచికం, ఆహార్యం - మూడింటితో మెప్పించే అభినయవిదులు మాత్రం కొందరే ఉంటారు. 1970లలో తెలుగు చిత్రసీమలో ప్రవేశించిన నటులలో ఈ మూడింటిలోనూ దిట్టగా కనిపించిన కొద్దిమందిలో ఒకరిగా నూతన్ ప్రసాద్ ఓ చిరకాల జ్ఞాపకం. కథానాయక పాత్రల దగ్గర నుంచి కామెడీ పాత్రలు, క్యారెక్టర్ పాత్రల వరకు ఏ వేషం కట్టినా, దాన్ని తనదిగా చేసుకొని సొంత ముద్ర వేయడం, మనిషి చూపులో, మాట విరుపులో విలక్షణత చూపడం 'నూతన్ ప్రసాద్'గా స్థిరపడ్డ తాడినాడ వరప్రసాద్‌లోని విశిష్టత. అనారోగ్యంతో గతనెల 30 వ తేదీన నూతన్ ప్రసాద్ కన్నుమూయడంతో తెలుగు సినీ రంగంలోని గుణచిత్ర నటుల చరిత్రలో ఓ అధ్యాయం ముగిసింది.

నిజానికి, నూతన్ ప్రసాద్ పెద్ద ఇంట్లో పుట్టి, వెనుక ఉన్న అండదండలతో సినీ రంగంలోకి నడిచొచ్చిన వాడు కాదు. ఆ మాటకొస్తే నటన కూడా ఆయనకు యాదృచ్ఛికంగా ఒంటబట్టినదే! చిన్నతనంలో బడికి వెళుతున్నప్పుడు ఊళ్ళో ఓ పౌరాణిక నాటక సమాజం వారి రిహార్సల్సు చూసీ చూసీ, పద్యాలు వినీ వినీ అనుకోకుండా అర్జునుడి పాత్ర పోషించడంతో ఆయన రంగస్థల జీవితం ఆరంభమైంది. నూతన్ ప్రసాద్ అసలు పేరు - దుర్గా సత్యవరప్రసాద్. స్వస్థలం - కృష్ణాజిల్లా కైకలూరు. తాడినాడ సుబ్బారావు, శ్యామలాంబ దంపతులకు 1945 డిసెంబర్ 12న జన్మించిన వరప్రసాద్ చదువుకున్నది కూడా అంతంత మాత్రమే. ఐ.టి.ఐ. పూర్తి చేసినా, నాటకాల మీద ఆసక్తితో అటువైపు నడిచారాయన. ఆయన తండ్రి కైకలూరులోని సమితి కార్యాలయంలో గుమస్తాగా పనిచేసేవారట! ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో తల్లి నిత్యం కుట్టుమిషన్ మీద పనిచేస్తూ, దుస్తులు కుడుతూ కుటుంబ భారాన్ని మోసేవారు. ఎస్.ఎస్.ఎల్.సి. వరకు కైకలూరులో చదివి, 1965లో మచిలీపట్నంలోని జాతీయ కళాశాలలో ఐ.టి.ఐ. పూర్తి చేశారు.

నాటకాల నుంచి సినిమాల్లోకి...

1966లో పి.డబ్ల్యు.డి.లో చిరుద్యోగిగా మొదలైన వరప్రసాద్ ఆ తరువాత హైదరాబాద్‌లోని 'హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్' (హెచ్.ఏ.ఎల్)లో చేరారు. అక్కడ సహోద్యోగి, ప్రముఖ రంగస్థల నటుడు భానుప్రకాశ్ నిర్వహిస్తున్న 'కళారాధన' నాటక సంస్థలో చేరి, ఎన్నో నాటకాలు వేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నాటక ప్రదర్శనలిచ్చి, ఉత్తమ నటుడిగా బహుమతులు గెల్చుకున్నారు. 'రాగరాగిణి', 'గాలివాన', ఏ.ఆర్. కృష్ణ దర్శకత్వంలో ఉన్నవ లక్ష్మీనారాయణ గారి 'మాలపల్లి' నవల నాటకరూపం - ఇలా ఎన్నో నాటకాల్లో ఆయన పాత్రపోషణ అందరినీ ఆకట్టుకుంది. "పాతికేళ్ళ వయస్సులో 'గాలివాన' నాటకంలో 65 ఏళ్ళ వృద్ధుడి పాత్ర పోషించి ఉత్తమ నటుడి అవార్డు పొందిన ప్రతిభ ఆయన సొంతం" అని రంగస్థల ప్రదర్శనలతోనే సినీ నటుడిగా ఎదిగిన ప్రముఖ నట - నిర్మాత మురళీమోహన్ గుర్తు చేసుకున్నారు. రాళ్ళపల్లి, పరుచూరి బ్రదర్స్, కోట శ్రీనివాసరావు లాంటి నాటి రంగస్థల, నేటి సినీ రంగ ప్రముఖులకు ఆ నాటకాల రోజుల నుంచే వరప్రసాద్ సుపరిచితుడు. 1971 ప్రాంతంలో విజయవాడలోని నాటకపోటీల్లో ఏకకాలంలో అటు గంభీరమైన 'గాలివాన' నాటకంలోనూ, ఇటు 'పైడిరాజు' అనే హాస్య నాటికలోనూ పరస్పర విభిన్నమైన పాత్రల్లో వరప్రసాద్ చూపిన ఉత్తమ నటనకు ఆకర్షితులైన రచయిత పినిసెట్టి శ్రీరామమూర్తి ఆయనను తెలుగు సినీ రంగంలోని తెలిసినవారికి పరిచయం చేశారు. కొత్తవాళ్ళతో నిర్మిస్తున్న 'నీడలేని ఆడది' (1974)తో ఆయన కెమేరా ముందుకు వచ్చారు. అయితే, దాని కన్నా ముందే బాపు - రమణల 'అందాల రాముడు' (1973) ఆయనను సినీ ప్రేక్షకుల ముందుకు తెచ్చింది. వెండితెరపై వరప్రసాద్ ఆవిర్భావం జరిగింది. ఆ తరువాత 'ముత్యాల ముగ్గు' (1975)లో నిత్య పెళ్ళికొడుకు పాత్రతో మెప్పించారు. 'కల్పన', 'ఊరుమ్మడి బ్రతుకులు' చిత్రాల్లో నటించారు. అయితే, ప్రతిభకు తగ్గట్లుగా ఆశించినన్ని సినిమా అవకాశాలు రాని పరిస్థితుల్లో కొన్ని నెలల పాటు ఆయన మద్యానికి బానిసగా మిగిలిపోయారు. ఆనక, తల్లి, భార్య తదితరుల అనునయంతో, ఆ అలవాటు నుంచి బయటపడ్డారు. ఆ వెంటనే కొద్ది రోజులకే వచ్చిన 'చలిచీమలు' (1978) అవకాశంతో సరికొత్త నటుడిగా, 'నూతన్ ప్రసాద్' అనే కొత్త పేరుతో తిరిగి విజృంభించారు.

విశిష్ట వాచికమే వశీకరణ మంత్రం

'ప్రెసిడెంట్ పేరమ్మ' (1979), 'తాతయ్య ప్రేమలీలలు' (1980), 'అమ్మ మనసు' లాంటి చిత్రాల్లో నాయక పాత్రధారిగా అలరించిన నూతన్ ప్రసాద్‌ది విశిష్టమైన వాచికం. మాటలోని స్పష్టత, స్వచ్ఛత, డైలాగును చెబుతున్నట్లుగా కాకుండా ఆ పాత్రే ప్రవర్తిస్తున్నట్లుగా విరుపులతో కొత్త అందం తీసుకురావడం, వ్యంగ్యం మిళాయించిన విలనీ ఆయనను విలక్షణ నటుడిగా నిలబెట్టాయి. 'చలిచీమలు' చిత్రానికి పరుచూరి బ్రదర్స్ రాసిన "నూటొక్క జిల్లాలకు అందగాణ్ణి" అనే డైలాగు నూతన్ నోట తెలుగు నాట చిరంజీవిగా మారిపోయింది. ఆ చిత్రంతో వచ్చిన గుర్తింపు ఆయనను వెనక్కి తిరిగి చూసుకొనే అవసరం లేకుండా చేసింది. ప్రాథమికంగా రంగస్థలం మీద నుంచి కెమేరా ముందుకు రావడం వల్ల నూతన్ ప్రసాద్ ఎంత నిడివి గల సంభాషణలనైనా, అలవోకగా గుర్తుంచుకొని, సింగిల్ టేక్‌లో షాట్ ఓ.కె. చేసేవారు. మహాభారత పౌరాణిక గాథను నేటి ఎన్నికల భారతావనికి వర్తింపజేస్తూ రూపొందిన 'కలియుగ మహాభారతం' (1979) చిత్రంలో రారాజు పాత్రలో నూతన్ ప్రసాద్ మెప్పించారు. ఆ పాత్రకు ఆయన చెప్పిన డైలాగుల గురించి జనం అప్పట్లో చెప్పుకున్నారు. చిత్రం నిడివిని పెంచడం కోసం ఆ పాత్రకు ఆఖరి నిమిషంలో రాసిన సుదీర్ఘమైన సంభాషణల్ని ఆయన అద్భుతంగా పండించారు. 'కుడి ఎడమైతే?' (1979) చిత్రంలో 450 అడుగుల షాట్‌ను ఆయన సింగిల్ టేక్‌లో చేసేశారనీ, అలాగే 'షోకిల్లా రాయుడు' సినిమాలో 786 అడుగుల షాట్ కూడా ఆయన అలా సింగిల్ టేక్‌లో చేసినదేననీ ఆ నాటి సినిమా సంగతులు తెలిసినవారు చెప్పేమాట. 'రాజాధిరాజు' (1980) చిత్రంలో సైతాను వేషంలో ఆయన ఆహార్యం, ఆంగికం, "శిశువా!" అంటూ ప్రత్యేక తరహా వాచికం ఆ పాత్రను చిరస్మరణీయంగా మార్చాయి. ఆ సినిమాలో "కొత్తా దేవుడండీ! కొంగొత్తా దేవుడండీ! ఇతడే దిక్కని మొక్కనివారికి దిక్కూ మొక్కూ లేదండండీ! రాండి! రాండి! శిశువా!..." అంటూ నూతన్ ప్రసాద్ ధరించిన సైతాను పాత్రపై వచ్చే పాట అప్పట్లో సామాన్య జనంలో కూడా ప్రాచుర్యం పొందింది. ఇక, 'పట్నం వచ్చిన పతివ్రతలు' (1982) చిత్రంలో నూతన్ పలికిన "దేశం చాలా క్లి...ష్ట పరిస్థితుల్లో ఉంది" డైలాగు ఆ నాటి నుంచి ఈనాటి వరకూ నిత్యనూతనమే.

తెలిసిన మనిషిలో తెలియని సంగతులు

చాలామందికి తెలియనిదేమిటంటే - 'ఈలపాట'లో వరప్రసాద్ సిద్ధహస్తుడు. హైదరాబాద్, తదితర ప్రాంతాల్లో ఆయన దాదాపు 50 పై చిలుకు సార్లు 'ఈలపాట' ప్రదర్శనలిచ్చారు. అలాగే, సినిమాల్లోకి వచ్చాక నూతన్ ప్రసాద్ ప్రభ వెలిగిపోతున్న సందర్భాన్నే సర్వసాధారణంగా అందరూ చెబుతుంటారు. కానీ, కెమేరా ముందు ఆ

స్థాయి నటన చూపడానికి మునుపే, రంగస్థలంపై ఆయన ఎంతటి విశ్వరూపం దాల్చేవారో, ఎన్ని వందల ప్రదర్శనల్లో నటుడిగా తనను తాను తీర్చిదిద్దుకున్నారో ఈ తరంలో కొద్దిమందికే తెలుసు. మంచి సినిమాల పట్ల అభిరుచి ఉన్న నూతన్ ప్రసాద్ చిత్ర నిర్మాణంలోనూ దాన్ని నిలబెట్టుకొనేందుకు ప్రయత్నించారు. 'పవన్ ఇంటర్నేషనల్' పతాకంపై ఆయన సమర్పకుడిగా వచ్చిన 'ఓ అమ్మ కథ' (1981) వాణిజ్య విజయం సాధించకపోయినా, విమర్శకుల ప్రశంసలను అందుకొంది. 'మృణాల్‌సేన్' తదితర ప్రసిద్ధ వాస్తవిక చిత్ర దర్శకుల ఫక్కీలో ఆ సినిమాకు దర్శకుడు పేరాల సుబ్రహ్మణ్యం పేరును 'వసంత్ సేన్'గా మార్చడం ఓ గమ్మత్తు! ఏ వేషం కట్టినా, దాన్ని తెర మీది కథలోని పాత్రగా కాక, వాస్తవ జీవితంలో నుంచి నడిచొచ్చిన వ్యక్తిగా తీర్చిదిద్దడానికి నూతన్ ప్రసాద్ తపించేవారు. అందుకే, ఆయన ఏ పాత్ర వేసినా దానిలో సమాజంలోని ఆ యా వర్గాల వ్యక్తుల ప్రవర్తన, చిత్రమైన మ్యానరిజమ్‌లను కలగలిపేవారు. ఆ మేరకు సాధ్యమైనంత వరకు ఆ పాత్రలో వాస్తవికతను రంగరించేవారు. "పదిమందిని ఏడిపించడం కన్నా, పదిమందినీ నవ్వించడం మంచిది కదా!" అని చెబుతూ వచ్చిన నూతన్ ప్రసాద్ విలనీలో కూడా తనదైన శైలిలో వ్యంగ్యాన్ని దట్టించేవారు. సంభాషణల ఉచ్చారణలో తనకున్న అపారమైన బలంతో ఏ పాత్రకైనా కొత్త రంగు, రుచి, వాసన అద్దేవారు. తల్లి ఎంతో కష్టపడి తమను పోషించిన తీరు ఆయనకు ఎప్పటికీ గుర్తే. "ఆ కుట్టు మిషన్ శబ్దాలు నేనెప్పటికీ మర్చిపోలేను" అనేవారాయన. నటుడిగా స్థిరపడ్డాక తల్లిని మరింత సుఖంగా, ప్రాణప్రదంగా చూసుకోవడానికి ఆయన చేసిన ప్రయత్నం ఆయన మనస్సులోని సెంటిమెంట్‌కు నిదర్శనం. ఒకసారి మనస్సుకు దగ్గరై, తనకు ప్రేమ పాత్రుడైన వ్యక్తిని చిరకాలం ప్రేమించడం కూడా నూతన్ ప్రసాద్ లక్షణం. 'చలిచీమలు' తరువాత వేషాల కోసం మద్రాసులో తిరుగుతూ, లాడ్జీలో అవస్థలు పడుతున్నప్పుడు బాపు - రమణలు ఏడాది పాటు తమ ఆఫీసులో ఆశ్రయం ఇచ్చిన సంగతిని ఆయన ఎప్పుడూ కృతజ్ఞతాపూర్వకంగా చెబుతుండేవారు. అలాగే, నటుడిగా సక్సెసయ్యాక తాను కూడా రచయితలు పరుచూరి బ్రదర్స్‌కు అలాంటి అండదండలే ఇచ్చారు. దాదాపు ఎనిమిదేళ్ళు తమ ఇంటి మేడ మీద స్థానం కల్పించారు.

ఆత్మవిశ్వాసానికి అసలైన ప్రతీక

బామ్మ మాట - బంగారు బాట' (1989) చిత్రం షూటింగ్‌లో ప్రమాదానికి గురై, నడుము కింది భాగమంతా చచ్చుబడిపోయి, చక్రాల కుర్చీకే పరిమితమైనా, ఆయన తన ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. పరుచూరి బ్రదర్స్ లాంటి రచయితలు తన కోసం ప్రత్యేకంగా రాసిన న్యాయమూర్తి, దెబ్బతిన్న సైనికాధికారి లాంటి పాత్రలను కేవలం వాచికంతో, ముఖకవళికలతో మెప్పించారు. వాచికంలోని తన విశిష్టతను టీవీ కార్యక్రమాల వ్యాఖ్యానానికి వినియోగించారు. ఉపగ్రహ తెలుగు టి.వి. ఛానల్ 'ఈ' టి.వి.తో మొదటి నుంచి అనుబంధం ఉన్న నూతన్ ప్రసాద్ మహామహుల నటనా వైదుష్యాన్ని విశ్లేషించే 'హ్యాట్సాఫ్' కార్యక్రమంతో సహా కొన్ని టీవీ షోలకు యాంకర్‌గానూ వ్యవహరించారు. 'నేరాలు - ఘోరాలు' లాంటి కార్యక్రమాలకు ఆయన మాట ఊపిరి అయింది. నిజానికి, సినిమాల్లోకి రాకముందే ఆయన టీవీలో నటించారు. అప్పట్లో దూరదర్శన్‌లో ప్రసారమైన 'పండగొచ్చింది' నాటికలో ఇంటల్లుడి పాత్ర పోషించారని కొద్దిమందికే తెలుసు. హీరో కృష్ణ రూపొందించిన 'సింహాసనం' (1986) చిత్రం తెలుగు రూపంలో హిందీ నటుడు అమ్జాద్ ఖాన్‌కు గళదానం చేసిన నూతన్ ప్రసాద్, 'ఆయనకు ఇద్దరు' చిత్రంలో గుమ్మడికీ డబ్బింగ్ చెప్పారు. దాదాపు 475 చిత్రాల్లో నటించిన నూతన్ ప్రసాద్ అనేక అవార్డులు అందుకున్నారు. 'సుందరి - సుబ్బారావు' (1984)లో ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డు పొందారు. 'ప్రజాస్వామ్యం' (1987), 'నవభారతం' (1988), 'వసుంధర' చిత్రాల్లోని నటన కూడా ఆయన ఇంటికి 'నంది'లను నడిపించుకొచ్చింది. అలాగే, 'గాజుపూలు' టీవీ సీరియల్‌కు సైతం ఆయన 'నంది' అవార్డు అందుకున్నారు. 2000లో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

ఆఖరి వరకు అలుపెరుగని కళాసేవ

చివరి రోజుల వరకు తనకు వచ్చిన పాత్రలకు న్యాయం చేయడానికే నూతన్ ప్రసాద్ ప్రయత్నించారు. "మేము నాటకం వేస్తున్నామని తెలిస్తే చాలు, ఇవాళ్టికీ చక్రాల కుర్చీలో సభకు వచ్చి, ప్రదర్శన చూసి, అభినందించే అరుదైన నాటక ప్రియుడు ఆయన" అని రంగస్థల ప్రదర్శనలతోనే సినీ రంగానికి ఎదిగిన మరో సీనియర్ నటుడు రాళ్ళపల్లి గద్గదస్వరంతో నూతన్ ప్రసాద్‌ను గుర్తు చేసుకున్నారు. 'తెలుగుదేశం పార్టీ'కి సన్నిహితంగా మెలిగిన నూతన్‌ప్రసాద్ శారీరక వైకల్యం వచ్చి పడ్డ తరువాతి కాలంలోనే హైదరాబాద్‌లోని రంగస్థల వేదిక 'రవీంద్రభారతి'కి కార్యదర్శిగా ప్రభుత్వ పక్షాన నియమితులయ్యారు. ఆ హోదాలోనూ తనదైన కళాసేవను కొనసాగించారు. ప్రముఖ చిత్రకారుడు - దర్శకుడు బాపు చేత శృంగార, హాస్య, కరుణాది నవరసాలకూ వర్ణచిత్రాలు వేయించి, ఆ నవరసాల చిత్ర మాలికను రవీంద్రభారతిలో పెట్టించారు. ఇవాళ ఆ నవరసాల చిత్రమాలిక రాష్ట్రంలోని అనేక ప్రాంగణాల్లో వెలసి, కళాప్రియులను అలరిస్తోందంటే దానికి నూతన్ ప్రసాద్ ప్రయత్నమే కారణమని చెప్పక తప్పదు. అలాగే, భారతీయ శాస్త్రీయ నృత్య రీతులను పరిచయం చేసే వర్ణచిత్రాలను గీయించి, 1973 జూన్ 10న ప్రమీలతో వివాహమైన నూతన్ ప్రసాద్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. వాళ్ళబ్బాయి నూతన్ కుమార్ అనే పేరుతో వెండితెరకు పరిచయమై, 'సాంబ', 'సోగ్గాడు' లాంటి చిత్రాల్లో నటించారు. అబ్బాయిని మంచి నటుడిగా చూడాలని నూతన్ ప్రసాద్ కలలు కన్నారు. ఆ కలలు పూర్తిగా ఫలించకుండానే కన్నుమూశారు. చాలాకాలంగా, పూర్తిస్థాయి పాత్రల్లో కనిపించకపోయినా, ఇవాళ్టికీ ప్రేక్షకులకు నూతన్ ప్రసాద్ గుర్తుండిపోవడం ఆయన మునుపు పోషించిన పాత్రల చిరస్మరణీయతకు చిహ్నం. సినిమా నటుడిగా ఆయన ప్రభ వెలిగింది గట్టిగా ఓ దశాబ్దమే అయినా, ఆయన గురించి జనం చెప్పుకోవడానికి ఆ పాత్రలే కారణం. అందుకే, 1960ల చివర నుంచీ నూతన్ ప్రసాద్‌తో స్నేహం ఉన్న మరో నటుడు కోట శ్రీనివాసరావు చెప్పినట్లు, 'తనకంటూ ఓ బ్రాండ్‌ను సృష్టించుకొని, తనదైన ఓ దశాబ్దాన్ని లిఖించుకున్న నటుడు - నూతన్ ప్రసాద్'. 1970ల ద్వితీయార్ధం నుంచి 1980ల చివరి వరకు తెలుగు సినిమా చరిత్ర రాస్తే - ఆ కాలంలో ఓ వెలుగు వెలిగిన విశిష్ట నటుడిగా నూతన్ ప్రసాద్‌ది నిత్య నూతన చరిత్ర. నటన పట్ల అంకితభావం, నిజాయతీ ఉన్న ఆయనకు కళాంజలి!

- రెంటాల జూనియర్

మామిడి రసం కోఫ్తా కర్రీ

కావలసిన పదార్థాలు

కోఫ్తాకి : మెత్తటి మాసం (క్రైమా) - పావుకేజీ, ఉల్లిపాయలు - పావుకేజీ
అల్లం వెల్లుల్లి పేస్ట్ - 3 స్పూన్లు, కొత్తిమీర - చిన్న కట్ట
పుదీనా - చిన్న కట్ట, గరంమసాలా పొడి - 1 స్పూన్
నిమ్మకాయ - సగం ముక్క, కారం - 1 టీస్పూన్
పసుపు - చిటికెడు, ఉప్పు - తగినంత, వేయించిన శనగపప్పు - 75 గ్రా

గ్రేవీకి కావలసినవి

ఉల్లిపాయలు - 3, అల్లం వెల్లుల్లి పేస్టు- 2 స్పూన్లు, కారం - 1 టీస్పూన్
పసుపు - చిటికెడు, నూనె - 4 స్పూన్లు, గరం మసాలా - 1 స్పూన్
గసగసాలు - 2 స్పూన్లు, సారపప్పు - 1 స్పూన్, కొత్తిమీర - 1 కట్ట
పెరుగు - 1 కప్పు, మామిడి పండ్ల రసం - 100 గ్రా, ఉప్పు - తగినంత

కోఫ్తా తయారీ

సగం కైమాలో అల్లం వెల్లుల్లి ముద్ద, కొత్తిమీర, పుదీనా, కారం, పసుపు, ఉప్పు వేసి కలపాలి. ఈ మిశ్రమానికి అరకప్పు నీళ్లు పోసి నీరంతా ఇంకిపోయే వరకు మెత్తగా ఉడికించాలి. వేయించిన శనగపప్పును మెత్తగా పొడిచేసుకోవాలి. ఉడికించిన కైమాను, మిగిలిన కైమతో కలిపి మెత్తగా గ్రైండ్ చేయాలి. దానికి గరంమసాలా పొడి, శనగపప్పు పొడి, నిమ్మరసం కలిపి చిన్న చిన్న ఉండలు చేసి పక్కన పెట్టాలి.



గ్రేవీ తయారీ : బాణలిలో తగినంత నూనెపోసి కాగనివ్వాలి. ఇందులో సన్నగా తరిగిన ఉల్లిపాయల్ని నిలువుగా చీల్చిన పచ్చిమిర్చిని దోరగా వేయించాలి. అందులోనే అల్లం వెల్లుల్లి ముద్ద, సారపప్పు, గసగసాల ముద్ద, కారం, ఉప్పు, కొత్తిమీర కలిపి నూనె చిందేవరకు వేయించాలి. ఇందులో ముందుగా చేసిపెట్టుకున్న కోఫ్తా ఉండలు వేసి కొంచెం సేపు ఉడికించాలి. ఐదు నిమిషాల తర్వాత గరం మసాలా, మామిడిపండ్ల రసం చేర్చి సన్నటి మంటపై మరికొంతసేపు ఉంచాలి. స్టౌమీది నుండి దించాక కొత్తిమీర, మీగడ వేసి వేడి వేడిగా తింటే చాలా బాగుంటాయి.

మామిడి మజాలు

మ్యాంగో శ్రీఖండ్

కావలసిన పదార్థాలు

గడ్డ పెరుగు - 1 లీటర్
చక్కెర పొడి - 150 గ్రా
మామిడిపండ్ల రసం - అరకప్పు
ఏలకులు - 5
జీడిపప్పు - 15 గ్రా

తయారు చేసే విధానం

గడ్డ పెరుగును సన్నటి బట్టలో మూట కట్టి నాలుగు గంటలు వడకట్టాలి. నీరంతా పోయి గట్టిగా అయిన పెరుగు ముద్దలో చక్కెరను కలపాలి. చక్కెర కరిగి ముద్ద అయ్యాక అందులో మామిడి పండ్ల రసం, ఏలకుల పొడిని కలిపితే శ్రీఖండ్ తయారయినట్టే. దీనిని పూరీలతో తింటే బాగుంటుంది.

ప్రాన్స్ మ్యాంగో పార్సెల్స్



కావలసిన పదార్థాలు

పచ్చి రొయ్యలు - 150 గ్రా
ఉల్లిపాయలు - 3
పచ్చిమిర్చి - 4
అల్లం వెల్లుల్లి పేస్టు - 2 స్పూన్లు
ఉప్పు - తగినంత
పసుపు - చిటికెడు
పచ్చిమామిడికాయ తురుము - 1 కప్పు
కొత్తిమీర - చిన్న కట్ట

పార్సెల్స్ తయారీ

మైదా పిండి - 150 గ్రా
ఉప్పు - సరిపడా
నెయ్యి - 2 టీస్పూన్లు
నూనె - వేయించడానికి సరిపడా
జీలకర్ర - 2 స్పూన్లు
గరం మసాలా - 2 స్పూన్లు

తయారు చేసే విధానం

కూర తయారీ : రొయ్యల్ని శుభ్రం చేసి వాటిలో పసుపు, కారం, ఉప్పు, అల్లంవెల్లుల్లి ముద్ద కలిపి గంటసేపు ఉంచాలి. బాండీలో నూనె పోసి కాగాక సన్నగా తరిగిన ఉల్లిపాయలు, పచ్చిమిర్చి వేసి దోరగా వేయించాలి. తర్వాత మసాలా పట్టించిన రొయ్యల్ని వేసి సన్నటి మంటమీద ఉడకనివ్వాలి. నీరంతా ఇంకిపోయేవరకు వేగనిచ్చి చివరిలో మామిడికాయ తురుగు వేసి కొద్దిగా మగ్గనివ్వాలి.

పార్సెల్స్ తయారీ : మైదాపిండిలో ఉప్పు, జిలకర, నెయ్యి వేసి చపాతీ పిండిలా కలపాలి. చిన్న వుండలు చేసి పూరీల్లా వత్తుకోవాలి. వీటి మధ్యలో రొయ్యల కూర పెట్టి పూరీని మడతపెట్టాలి. మడత విడిపోకుండా కొద్దిగా తడిచేసి అతికించాలి. వీటిని బాగా కాగిన నూనెలో దోరగా వేయిస్తే సరి. వేడి వేడి ప్రాన్స్ మ్యాంగో పార్సెల్స్ రెడీ.

మ్యాంగో హనీక్రీమ్

కావలసిన పదార్థాలు

మామిడి పండ్లు - 4, చక్కెర - 1 కప్పు, తేనె - 4 స్పూన్లు
పాలు - 1 గ్లాసు, కస్టర్డ్ పౌడర్ - 4 స్పూన్లు, మీగడ - 1 కప్పు

తయారు చేసే విధానం

పాలు బాగా మరిగించి మంట సిమ్‌లో పెట్టుకోవాలి. కొద్దిగా చల్లటి పాలల్లో కస్టర్డ్ పౌడర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని, చక్కెరను మరుగుతున్న పాలల్లో కలుపుకోవాలి. ఇందులోనే మామిడి పండ్ల రసాన్ని కలిపి బాగా చల్లారనివ్వాలి. ఐస్‌క్రీమ్ కప్పుల్లో మామిడి పండ్ల ముక్కలు వేసి కొద్దిగా తేనె, మీగడ వేయాలి. ఆ పైన ఈ మ్యాంగో కస్టర్డ్ కలిపిన మిశ్రమాన్ని పోసి అందించాలి. మండు వేసవిలో చల్లగా అందిస్తే మజాగా ఉంటుంది.



కొత్త పుస్తకాలు

అనుభవాల సారం



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అగ్రనేత ఇఎంఎస్ నంబూద్రిపాద్ రచించిన 'ఓ కమ్యూనిస్టు జ్ఞాపకాలు' ఆయన జీవితపు అనుభవాల సారం. తన స్వానుభవంతో అనేక దశాబ్దాల చారిత్రిక రాజకీయ పరిణామాలను ఇందులో సరళమైన శైలిలో వివరించారు. తమ అనుభవాలను ముందు తరాలకు అందించేందుకు ఆయన కృషికి నిదర్శనం ఈ గ్రంథం. గత కాలపు రాజకీయ, చారిత్రిక పరిణామాలు, సైద్ధాంతిక ఘర్షణల గురించి ముందు తరాలకు అందించారు. జాతీయ, అంతర్జాతీయ రాజకీయ, సైద్ధాంతిక పరిణామాలను సరైన దృక్పథంతో విశ్లేషించి, అవగాహన కల్పించేందుకు ఇఎంఎస్ శాస్త్రీయంగా విశ్లేషించారు. పార్టీ కార్యకర్తలకు, ముఖ్యంగా యువ కార్యకర్తలకు గడిచిన తరం నేతల జీవితానుభవాలు గొప్ప స్ఫూర్తిని అందిస్తాయనడంలో సందేహం లేదు. అటువంటి స్ఫూర్తిదాయకమైన పుస్తకమే ఇది. పదమూడు, పధ్నాలుగేళ్ళ వయస్సులో బోల్షివిజం అనే మాటను గురించి విన్న నాటి నుంచీ 1964 తరువాత సంభవించిన ఆంతరంగిక పోరాటాల వరకూ తన అనుభవాలను 30 అధ్యాయాలుగా విడదీసి సవివరంగా ఆయన తెలియజేశారు. అగ్రవర్ణానికి చెందిన ఛాందస బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి కుల, మత, ప్రాంతీయ తేడాలు లేని సమాజం కోసం ఆయన చేసిన కృషి ఇందులో మనకు దర్శనమిస్తుంది. తాను రాజకీయ కార్యకర్తగా ఎలా ఎదిగిందీ వివరిస్తూ 'నంబూద్రి యోగ క్షేమ సభ సమావేశాలకు పదేళ్ళ పాటు తప్పక హాజరయ్యేవాణ్ణి. అంటే జాతీయ రాజకీయ చైతన్యం సంఘ సంస్కరణాభిలాష నుంచి విడదీయలేనంతగా నాలో ముడిబడి ఉండేది. అవి రెండూ కలిసి నన్ను ఆ తర్వాత కాలంలో అంకిత భావం గల రాజకీయ కార్యకర్తగా చేశాయి.' రాజకీయ చైతన్యానికీ-ఆచరణకూ, సామాజిక ఛాందసానికి-ప్రగతిశీలతకూ మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని గురించి వివరిస్తూ 'మా తరానికి చెందిన అగ్రవర్ణ దేశభక్తులం విదేశీ అధికారాన్ని ఎదుర్కోవడానికిగాను తిరోగామి దృక్పథం గల కులాన్ని ధిక్కరించవలసి వచ్చింది. ఆ విధంగా మేము రెంటినీ ఖాతరు చేయలేదు. ఆ విధంగా నిలబడటం మా తరం వారికి ఎంతో సంతృప్తి నిచ్చింది. అలా నిలబడటం వల్ల సమగ్ర విప్లవోద్యమానికి రంగం సిద్ధమైంది. అదే కాలక్రమేణా కేరళలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావానికి దారి తీసింది.' తనకు కమ్యూనిస్టు పార్టీతో పరిచయం ఏర్పడిన విషయాన్ని గురించి వివరిస్తూ 'నాకు సుందరయ్య ద్వారా కమ్యూనిస్టు పార్టీ పరిచయం కలిగింది. తత్ఫలితంగా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ (సిఎస్‌పి) కేరళ శాఖలో ఉన్న నేను, కృష్ణపిళ్ళే, తదితరులం 1937, జులైలో తొలిసారిగా సిపిఐ కేరళ శాఖను స్థాపించాము. సిఎస్‌పిలో అంతర్గతంగానూ, అలాగే సిఎస్‌పి, సిపిఐ మధ్య తీవ్ర పోరాటం చెలరేగింది. చివరకు కేరళ సిఎస్‌పి, సిపిఐగా మారింది.' ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని రెండు సార్లు తోసిపుచ్చడానికి సంబంధించి వివరిస్తూ కాంగ్రెస్ నిజ స్వరూపాన్ని బయటపెట్టారు. '1937 సాధారణ ఎన్నికల్లోనూ, 1939లో ఎమ్మెల్యే మృతి వల్ల ఉప ఎన్నిక జరిగిన సందర్భంలోనూ పోటీ చేయడానికి దరఖాస్తు చేశాను. దాన్ని ఏ కారణంతో తోసిపుచ్చారో తెలుసుకుంటే ఆసక్తిదాయకంగా ఉంటుంది. నేను కులం నుంచి వెలివేయబడిన నంబూద్రినని, నాకు అప్రతిష్ట ఉందనీ, అందువల్ల ఛాందసులు ఉండే ఆ నియోజకవర్గంలో నేను ఓట్లు తెచ్చుకోవడం కష్టమని మొదట చెప్పారు. రెండోసారి దరఖాస్తు చేసినప్పుడు అది తియ్యలు, ఎజ్వాలు ఎక్కువగా ఉండే నియోజకవర్గమని, అక్కడ నాలాంటి నంబూద్రి పోటీకి తగదని చెప్పారు. నిజానికి అసలు అడ్డంకి నా రాజకీయ భావాలే తప్ప మరేమీ కాదన్నది తెలిసిన విషయమే.' తాను మొదటిసారి అజ్ఞాతంలోకి వెళ్ళినప్పుడే గాంధీజీ ఎవరినైతే దరిద్ర నారాయణులన్నారో వారితో ప్రత్యక్ష పరిచయం ఏర్పడినట్లు ఆయన తెలిపారు. అగ్రకుల భూస్వామ్య కుటుంబం నుంచి వచ్చిన తాను కేరళ శ్రామికవర్గ ప్రజల దత్తపుత్రుడుగా మారడానికి ముందు శిక్షణా కాలం లాంటిది ఆ అనుభవమని ఇఎంఎస్ వివరించారు. కేరళలో తొలిసారిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు గవర్నర్ పెట్టిన అనేక ఇబ్బందుల గురించి వివరించారు. అప్పుడు కమ్యూనిస్టు పార్టీకి 60 సీట్లు లభించాయి. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు అవి సరిపోవు. అప్పుడు మరో ఐదుగురు ఇండిపెండెంట్ సభ్యులను కలుపుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. స్వతంత్ర భారత చట్రం పరిధిలో నూతన రాష్ట్రమైన కేరళ ఎలా అభివృద్ధి చెందాలనే దానిపై కమ్యూనిస్టు పార్టీకున్నంత స్పష్టత మరే పార్టీకీ లేదని ఆ అధ్యాయంలో వివరించారు. అప్పుడు తమ ప్రభుత్వం చేపట్టిన భూసంస్కరణలు, పారిశ్రామిక విధానం, నూతన విద్యా బిల్లు వంటివి సంచలనం సృష్టించాయని తెలిపారు. 'మేము కేంద్ర విధానాలను అతిక్రమించకుండా ఆ బిల్లులను తయారు చేసినప్పటికీ కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన ఉన్న కేంద్ర ప్రభుత్వం భూసంస్కరణలు, విద్యా సంస్కరణల బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం రాకుండా తొక్కి పట్టింది. నిజానికి వాటిని వెనక్కి పంపివేసింది. అప్పటికే కమ్యూనిస్టు ప్రభుత్వం డిస్మిస్ చేయబడింది' అని వివరించారు. ఇంకా ఈ గ్రంథంలో సిపిఐలో వచ్చిన చీలిక, సైద్ధాంతిక విభేదాలను గురించి, అంతర్జాతీయ సంబంధాల గురించి కూడా సవివరంగా వివరించారు. అందరికీ సరళంగా అర్థమయ్యే రీతిలో ఈ గ్రంథం సాగింది. అభ్యుదయవాదులకు ముఖ్యంగా ప్రజా ఉద్యమాల్లో ఉన్న కార్యకర్తలకు ఇది స్ఫూర్తినిచ్చే గ్రంథం.

ఓ కమ్యూనిస్టు జ్ఞాపకాలు : రచన: ఇఎంఎస్ నంబూద్రిపాద్: వెల : రూ.60 :
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

- ఎస్. సరోజిని

ప్రజాప్రతినిధుల సమాచార నిధి

మన ఎమ్మెల్యేలు, ఎంపీలకు సంబంధించిన క్లుప్త సమాచారాన్ని గుదిగుచ్చి ఒక దగ్గర చేర్చిన పుస్తకం ఇది. 'ఆంధ్రప్రదేశ్ ప్రజాప్రతినిధులు 2009-2014' శీర్షికతో పేట్రియాట్ పబ్లికేషన్స్ ప్రచురించిన ఈ పుస్తకం ప్రజాప్రతినిధులకు సంబంధించిన సమాచారాన్ని అందివ్వడంలో ఎంతో ఉపయోగపడుతుంది. పుస్తకం పేరును ప్రజాప్రతినిధులకు పరిమితం చేసినప్పటికీ వాస్తవానికి నియోజకవర్గాలకు సంబంధించిన కీలక సమాచారం కూడా ఈ పుస్తకంలో పొందుపరిచారు. పునర్విభజన తరువాత నియోజకవర్గాల ప్రస్తుత స్వరూపానికి సంబంధించిన మ్యాప్, మండలాల వివరాలనూ ప్రచురించారు. క్లుప్తంగానే ఉన్నప్పటికీ ఎంతో ఉపయోగపడే సమమాచారమిది. ప్రజాప్రతినిధులకు సంబంధించి సాధ్యమైనంత మేర పూర్తిస్థాయి సమాచారాన్ని ఇవ్వడానికే ప్రయత్నించారు. ప్రజాప్రతినిధుల ఫోటోలతో పాటు వారి పార్టీ, గుర్తు, గతంలో ఎన్నికైన వివరాలు, విద్యార్హతలు, ఆసక్తులు, కుటుంబ సమాచారం కూడా ఇచ్చారు. స్థానికంగా వారి పూర్తి చిరునామా ఇవ్వడంతోపాటు ఫోన్ నెంబర్లను ప్రచురించడం సాధారణ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. రాష్ట్రంలోని 295 మంది ఎమ్మెల్యేలు, 42 మంది ఎంపీలకు సంబంధించిన కీలక సమాచారాన్ని పొందుపరిచిన ఈ పుస్తకాన్ని 'హ్యాండ్‌బుక్' గా ప్రచురణకర్తలు ముందుమాటలో పేర్కొన్నప్పటికీ చేతిలో ఇమిడే ప్రజాప్రతినిధుల సమాచార నిధిగా దీనిని అభివర్ణించవచ్చు రాష్ట్రంలో నెలకొన్న రాజకీయపరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రులు మారినప్పటికీ ఈ పుస్తకానికున్న విలువ తగ్గదు.



ఆంధ్రప్రదేశ్ ప్రజాప్రతినిధులు2009-2014,
ఎం.ఎల్.ఎ, ఎంపీల విశేషాలు, పేజీలు :186, వెల :200/-
ప్రతులకు : పేట్రియాట్ పబ్లికేషన్స్

- వి. రాజగోపాల్



పల్లెకు పోదాం... ఛలో... ఛలో...

ఊరి చుట్టూ పచ్చని పొలాలు, ఇంటింటికీ పాడి పశువులు, ఊరి మధ్యలో రచ్చబండ, ఊరి చివర చేదబావి... స్వచ్ఛమైన గ్రామీణ వాతావరణం. వాహనాల హారన్లు లేవు, ట్రాఫిక్ జాముల్లేవు...ఉరుకులూ పరుగులు మచ్చుకైనా కనిపించవు. వాతావరణ కాలుష్యం అసలే ఉండదు. ఎంతటి ప్రశాంత వాతావరణమో... అబ్బ చదువుతుంటేనే ఎంత బాగుందో! అలాంటి ఊళ్లో ఉంటే ఇంకెంత బావుంటుందో అనిపిస్తుంది!

దైనందిన జీవితానికి అవసరమైన వస్తువులు, వ్యవసాయానికి కావలసిన పనిముట్లు... ఇలా ఏవి కావాలన్నా అక్కడ కనిపిస్తాయి. ఇక ఆ ఊళ్లో లేని కుల వృత్తంటూ లేదు. కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసాలి మొదలు జాలర్ల వరకు అందరూ ఉంటారు. ఎటు వైపు చూసినా సరే అందరూ ఎవరి పనుల్లో వాళ్ల యమాబిజీగా కనిపిస్తారు. అరె... పలకరిద్దామంటే ఒక్కరూ తల తిప్పి చూడరే! ఇదంతా చదువుతోంటే అది ఏ ఊరో తెలుసుకోవాలనుందా! ఆ ఊరు కాని ఊరిపేరు సిద్ధగిరి. అక్కడ కనిపించేవాళ్లందరూ మనుషుల్లానే ఉంటారు. కానీ మనుషులు కాదు. జీవకళ ఉట్టిపడే ప్రాణంలేని మట్టి బొమ్మలు.

ఒక వైపు చూస్తే నూతి నుండి బిందెలూ కాగులతో నీళ్ల మోసుకెళ్తున్న మనుషులు కనిపిస్తారు. దూరం నుండి చూస్తే వాళ్ల నిజంగా మనుషులేనేమో, అయ్యో ఆమె బిందెమీద బిందె అలా మూడు బిందెలు పెట్టుకొస్తుంది. పై బిందె పడిపోతుందేమో అనిపిస్తుంది. మరోపక్క చూస్తే ఓ మనిషి నాగలి దున్నుతుంటే వెనకున్నామె విత్తనాలు వేసుకుంటూ వస్తుంది. అటేముందో చూద్దామని మరో పక్క చుస్తే లేగదూడ ఆవు దగ్గర పాలు తాగుతూ కనిపిస్తుంది.

అలా నడుచుకుంటూ పోతే ఓ ఇంట్లో తండ్రి తన బాబును కాళ్లమీద ఉయ్యాలూపుతూ కనిపిస్తాడు. మరో ఇంట్లో చంటి బిడ్డకు పాలిస్తున్న తల్లి చేతులకు గాజులేయించుకుంటుంది. ఒకామె బొంతలు కుడుతుంటే, మరోచోట పరుపులు కుడుతుంటుంది మరొకామె. అలా నడుస్తుంటామా... అరె! అక్కడ బండిలో ఎవరో వెళ్తున్నారే అని చూస్తాం. తీరా చూస్తే ఆ బండిలో ఉన్నది ఎవరో



తెలుసా? అత్తారింటికి వెళ్తున్న కొత్త పెళ్లికూతురు. ఇంతలో రచ్చబండ దగ్గర కొందరు మాట్లాడుతూ కనిపిస్తారు. అలా పొలాల వంక చూస్తామా... అక్కడ కొందరు పిల్లలు ఎద్దుల్ని కాస్తున్నారు. మళ్లీ ఊళ్లోకొస్తే ఓ ఇంట్లో వ్యాధిగ్రస్తుడికి వైద్యం చేస్తున్న అయ్యవారు అగుపిస్తారు. ఆ పక్కనే గుడి నుండి తల్లీ కూతుర్లు వస్తున్న దృశ్యం. ఇక పొలంలో ధాన్యాన్ని తూర్పారబట్టే దృశ్యాన్ని చూస్తే నిజంగానే మనం పొలంలో ఉన్నామా అనిపిస్తుంది.

ఓ అమ్మ కూరగాయలు కొంటుంటే, మరో ఇంట్లో పాలు పితుకుతున్న దృశ్యం కనిపిస్తుంది. ఊరి పొలిమేరలోని గుడిముందు వీరతాళ్లు కొట్టుకుంటున్న వ్యక్తి దర్శనమిస్తాడు. ఇంకోవైపు ఈ దృశ్యాలన్నింటినీ తన కెమెరాలో బంధిస్తుంటాడు ఓ యువకుడు.... ఇలా ఒకటా రెండా ఎన్నని చెప్పగలం. ఇలాంటి దృశ్యాలన్నీ మన హైదరాబాదులోని శిల్పారామంలోనూ కనిపిస్తాయి. కాకపోతే అక్కడున్న చెట్టూచేమా, చుట్టూ ఉండే పచ్చని పంటపొలాలు మన దగ్గర లేవు. అక్కడి పొలాల్లోని దృశ్యాలని చూస్తుంటే నిజంగానే వాళ్లంతా పొలం పని చేస్తున్నారా? అనిపిస్తుంది.

బెంగుళూరు - పూనె హైవే మీదున్న కొల్హాపూర్‌కి సమీపంలోని కనేరిలో ఉంది శ్రీ క్షేత్ర సిద్ధగిరి మఠం. దీన్నే కనేరి మఠం అనికూడా అంటారు. ఈ మఠం వెయ్యి సంవత్సరాల కిందటే వెలిసింది. 27వ మఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన అదృశ్య కడసిద్ధేశ్వర్ స్వామీజీకొచ్చిన ఆలోచనే ఈ మ్యూజియం. పూర్వం మహారాష్ట్రలోని గ్రామీణ వాతావరణం ఎలా వుండేదో నేటి తరానికి తెలియజెప్పాలనే ఉద్దేశంతోనే ఈ మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు.

దీన్ని ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. సుమారు 80 గ్రామీణ దృశ్యాలకు అక్కడ రూపమిచ్చారు. 300 మందికి పైగా వివిధ పనుల్లో నిమగ్నమైన మనుషులు కనిపిస్తారు. ఇక్కడ మనుషుల బొమ్మలే కాదు ఎన్నో రకాల జంతువుల బొమ్మలు కూడా కనిపిస్తాయి. ఒక్క మనుషులు జంతువులు, పశు పక్ష్యాదులే కాదు. రాశిఫలాల్లోని పన్నెండు రాశిచక్రాల్నీ ఇక్కడ చూడొచ్చు.

'అబ్బా... ఈ సిటీ లైఫ్‌తో విసిగెత్తిపోతున్నాం. హాయిగా ఏ పల్లెటూళ్లో ఓ రెండు రోజులు గడిపొస్తే ఎంత బాగుంటుందో అనుకునేవారికి ఇది మంచి పర్యాటక ప్రదేశం.

ఇక్కడ ఆయుర్వేదిక్ థెరపీలో పంచకర్మ చికిత్సను ఏర్పాటు చేశారు. దీర్ఘకాలం వ్యాధులతో బాధపడే వారు ఈ చికిత్స చేయించుకోడానికి ఉత్సుకత కరబరుస్తుంటారు. అంతేకాదు ఇక్కడ పండే చెరకుతో బెల్లం తయారు చేసే ఫ్యాక్టరీని కూడా ఏర్పాటు చేశారు. సందర్శకుల ద్వారా వచ్చే ఆదాయంతోనూ, విరాళాలతోనూ ఇక్కడో ఆసుపత్రిని కూడా నిర్మించబోతున్నారు. అదే సిద్ధగిరి హాస్పటల్ అండ్ రీసెర్చ్ సెంటర్.

సిద్ధగిరి వెళ్లాలంటే....

కొల్హాపూర్‌కి పది కిలోమీటర్ల దూరంలో కనేరి మఠం ఉంది. అక్కడికి కనేరి లేదా కాగల్ బస్సులో వెళ్లొచ్చు. బెంగుళూరు పూనె హైవే మీదుగా వెళ్తే గోకుల్ షిరాగావ్ నుండి సుమారు నాలుగైదు కిలోమీటర్లు లోపలికి వెళ్లాలి. ★





28 ఏళ్ల నిరీక్షణ ఫలించింది. 121 కోట్ల మంది భారతీయుల కలలు ఫలించాయి. భారత క్రికెట్ జట్టు రెండోసారి జగజ్జేతగా నిలిచింది. మన క్రికెటర్లపై దేశ విదేశాల నుండి అభినందనల జల్లు కురిసింది. లీగ్ దశలో తడబడి... క్వార్టర్స్‌లో ప్రపంచ విజేతలనే మట్టి కరిపించి... సెమీస్‌లో పాకిస్తాన్‌ను ఓడించి... ఫైనల్లో పటిష్టమైన శ్రీలంకపై విజయం సాధించడం ద్వారా భారత జట్టు ప్రపంచ కప్‌ను సొంతం చేసుకుంది. అంతేకాదు ముంబయి దాడుల తర్వాత పొరుగు దేశమైన పాకిస్తాన్‌తో దెబ్బతిన్న సంబంధాలను గాడిలో పెట్టడంలో క్రికెట్ వారధిగా కూడా నిలిచింది. భారత జట్టు ప్రపంచ కప్పు సాధించడం వెనుక నిలిచిన ప్రధానమైన కారణాలేవిటనేదే ఈ వారం అట్టమీది కథ.

కప్పుకు 10 కారణాలు

-ఎం.డి. హసన్ షరీఫ్

భారత జట్టుకు పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ ఉంది. ఓపెనర్‌గా వీరేంద్ర సెహ్వాగ్ అందించిన స్ఫూర్తి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. సెహ్వాగ్ ఇన్నింగ్స్ ప్రారంభంలో మెరుపు వేగంతో 40-50 పరుగులు చేస్తే జట్టు విజయం ఖాయమని సగటు అభిమాని కూడా నిశ్చింతగా ఉండే స్థితికి తెచ్చాడు. తొలి మ్యాచ్‌లోనే బంగ్లాదేశ్‌పై 175 పరుగులు చేసి భారత్ ప్రపంచ కప్ సాధిస్తుందనే విశ్వాసాన్ని సహచరుల్లో, అభిమానుల్లో నింపాడు. తర్వాత భారీ స్కోర్లు చేయకున్నా అతడందించిన స్ఫూర్తితో ఇతర ఆటగాళ్లు మిగిలిన కార్యాన్ని పూర్తి చేశారు.

'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' యువరాజ్ సింగ్ అందరి అంచనాల్ని తలకిందులు చేస్తూ ప్రపంచ కప్ సాధించడంలో కీలక ఆటగాడిగా నిలిచాడు. ప్రపంచకప్‌కు ముందు ఫాంలో లేకున్నా సెలెక్టర్లు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయక విజృంభించాడు. బ్యాట్‌తోనే కాదు.. బంతితోనూ మ్యాజిక్ చేశాడు. టోర్నీలో నాలుగుసార్లు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడంటేనే అతడి ఆట తీరు ఎలాగుందో అర్థం చేసుకోవచ్చు. సహజంగా దూకుడుగా ఆడే యువీ ఈ టోర్నీలో సమయోచితంగా ఆడుతూ పరిణతిని ప్రదర్శించాడు. ఆస్ట్రేలియా, ఐర్లాండ్, నెదర్లాండ్స్‌పై జట్టు క్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు చక్కని ఇన్నింగ్స్‌తో విజయపథాన నడిపించాడు.

సెహ్వాగ్ అందించిన మెరుపు ఇన్నింగ్స్‌ను సద్వినియోగం చేసి జట్టును ఒత్తిడి నుండి బయటపడేయడంలో విలువైన ఆటగాడిగా నిలిచాడు గౌతమ్ గంభీర్. ఫైనల్లో అతడి ఇన్నింగ్స్ చిరస్మరణీయం. ఓపెనర్లిద్దరూ త్వరగా అవుటైన తరుణంలో అతడు నిలబడడం వల్లే ధోనీ రెచ్చిపోగలిగాడు. ఒత్తిడిలోనూ అతడి ఆటతీరు భేష్. అయితే ఫైనల్లో కేవలం మూడు పరుగులతో సెంచరీ మిస్ కావడం బాధాకరం. ప్రారంభంలో పెవిలియన్‌కే పరిమితమైన సురేష్ రైనా టోర్నీ

మధ్యలో లభించిన అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. క్వార్టర్స్, సెమీస్‌ల్లో (34 నాటౌట్, 36 నాటౌట్) క్లిష్ట పరిస్థితిలో చేసిన అమూల్యమైన పరుగులు జట్టు విజయానికి ఎంతో దోహదపడ్డాయి. టోర్నీకి ముందు అద్భుత ఫాంలో ఉన్న విరాట్ కోహ్లి ఆశించిన స్థాయిలో ఆడలేకపోయాడు. టోర్నీని సెంచరీతో ఆరంభించినప్పటికీ తర్వాత పెద్దగా రాణించలేదు. లీగ్ దశలో వెస్టిండీస్‌పై, తర్వాత ఫైనల్లో క్లిష్ట సమయంలో విలువైన ఇన్నింగ్స్ ఆడి జట్టు ప్రపంచ కప్ అందుకోవడంలో తన వంతు కృషి చేశాడు.

యువరాజ్ సింగ్ : మ్యాచ్‌లు - 9, పరుగులు - 362, సగటు - 90.50, వికెట్లు - 15.

గౌతమ్ గంభీర్ : మ్యాచ్‌లు - 9, పరుగులు 393, సగటు - 43.66

సురేష్ రైనా : మ్యాచ్‌లు -4, పరుగులు -74.

విరాట్ కోహ్లి : మ్యాచ్‌లు - 9, పరుగులు - 282, సగటు - 35.25.

బౌలింగ్‌లో వీక్ అయినా...

భారత జట్టు బలహీనమైన బౌలింగ్‌తోనే బరిలోకి దిగింది. అయితే ప్రపంచ కప్ సాధించడంలో జహీర్ ఖాన్ పాత్ర అమోఘం. ప్రతిభకు తగిన గుర్తింపు అతనికి లభించలేదు. ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రతిభ గల ఫాస్ట్

బౌలర్‌గా నిలిచాడు. వికెట్ కావాల్సిన ప్రతిసారి ధోనీకి ఏకైక దిక్కుగా జహీర్ కనిపించేవాడు. కెప్టెన్ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని ఈ లెఫ్ట్ ఆర్మ్ పేస్ బౌలర్ ఎప్పుడూ వమ్ము చేయలేదు. ఈ ప్రపంచ కప్‌లో అత్యధిక వికెట్లు తీసుకున్న జహీర్ ఎనిమిదేళ్ల క్రితమే ఆడమ్ గిల్‌క్రిస్ట్, మాథ్యూ హెడెన్ వంటి హేమాహేమీలకు నిద్రలేని రాత్రుళ్లను బహూకరించాడు. జహీర్ బౌలింగ్‌ను అతడి సహచరులు ఆశిష్ నెహ్రా, జవగళ్ శ్రీనాథ్ 'జాక్ అటాక్'గా అభివర్ణించారు. ప్రపంచ కప్ సాధించడంలో ప్రధాన భూమిక పోషించిన జహీర్ బౌలింగ్ అమోఘం. ఇంగ్లండ్‌తో మ్యాచ్ అతడి వల్లే టైగా ముగిసింది. 2003లో ఇప్పటికంటే వేగంగా బౌలింగ్ చేసిన జహీర్ బంతుల్లో ప్రస్తుతం పరిణతి కనబడింది. కీలక సమయాల్లో ఆందోళనకు గురికాకుండా ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేయడంలో సఫలమయ్యాడు. 2006లో పాక్ పర్యటన నుండి వచ్చినప్పుడు జహీర్ కంటే ఎస్ శ్రీశాంత్, ఆర్‌పి సింగ్, ఇర్ఫాన్ పఠాన్, వీఆర్వీ సింగ్ మెరుగ్గా కనిపించారు. అయితే 2006-07లో జరిగిన రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ జహీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. బెంగాల్‌తో జరిగిన ఫైనల్లో ఏకంగా తొమ్మిది వికెట్లు సాధించాడు. గాయాలతో వెనకబడినప్పటికీ మరింత పదునైన బౌలింగ్‌తో రాటుదేలిన బౌలర్ ఇతడు మాత్రమే. ఈ ప్రపంచ కప్‌కు ముందు ఇంగ్లండ్, న్యూజిలాండ్‌లపై టెస్ట్ సిరీస్‌లు సాధించడంలో, దక్షిణాఫ్రికాపై రెండు టెస్టుల్లో విజయం సాధించడంలో జహీర్ పాత్ర కీలకం. బాట్స్‌మన్‌ను చదివి, అతడి వీక్‌పాయింట్స్‌ను అర్థం చేసుకోవడం, దానికి అనుగుణంగా బౌలింగ్ చేయగల సత్తా జహీర్‌కు ఉంది. అతడు ప్రతి బంతిని ఒక పద్ధతి ప్రకారం వేస్తాడు.

మునాఫ్ పటేల్ అద్భుతంగా బౌలింగ్ చేయకపోయినా ఫర్వాలేదనిపించాడు. జహీర్‌కు మంచి సహకారాన్ని అందిస్తూ పొదుపుగా బౌలింగ్ చేయడంతో పాటు కీలకమైన వికెట్లు తీశాడు. ఇతడి లైన్ అండ్ లెంగ్త్‌తో ప్రత్యర్థి జట్టుకు ఎక్కువగా పరుగులు ఇవ్వలేదు. అశ్విన్ రెండు మ్యాచ్‌లే ఆడినప్పటికీ ఆకట్టుకున్నాడు. పొదుపుగా బౌలింగ్ చేస్తూ నాలుగు వికెట్లు కూడా తీశాడు. ఫైనల్లో హర్భజన్ ఎక్కువ వికెట్లు తీయకపోయినా టోర్నీలో టాప్ స్కోరర్‌గా నిలిచిన దిల్షాన్‌ను బౌల్డ్ చేసి శ్రీలంకను కష్టాల్లోకి నెట్టాడు. అయితే సీనియర్ బౌలర్ స్థాయికి తగినట్లు ఆడలేకపోయాడు. పరుగులు తక్కువే ఇచ్చినా ఎక్కువ వికెట్లు తీయడంలో విఫలమయ్యాడు.

జహీర్ : మ్యాచ్‌లు - 9, వికెట్లు - 21, సగటు - 18.76



హర్భజన్ సింగ్ : మ్యాచ్‌లు - 9, వికెట్లు - 9, సగటు - 43.33

మునాఫ్ పటేల్ : మ్యాచ్‌లు - 8, వికెట్లు - 11, సగటు - 32.09

నెహ్రా : మ్యాచ్‌లు - 3, వికెట్లు - 3,

శ్రీశాంత్ : మ్యాచ్‌లు - 2, వికెట్లు - 0.

అశ్విన్ : మ్యాచ్‌లు - 2, వికెట్లు - 4.

పుంజుకున్న ఫీల్డింగ్

ఫీల్డింగ్‌లో భారత జట్టుపై సదభిప్రాయం లేదు. కానీ భారత క్రికెటర్లు ఈ టోర్నీలో మాత్రం జూలు విదిలించారు. కీలకమైన క్వార్టర్ ఫైనల్లో ఆస్ట్రేలియాను 260 పరుగుల వద్దే కట్టడి చేయడంలో, పాక్‌ను 231కే ఆలౌట్ చేయడంలో ఫీల్డర్లు నిర్వహించిన పాత్ర అమోఘం. ఒకవైపు యువరాజ్ సింగ్, మరోవైపు విరాట్ కోహ్లి పెట్టని కోటగా నిలిచారు. ఫైనల్లోనూ చివరి ఓవర్లలో మినహాయిస్తే ప్రారంభంలో లంక బ్యాట్స్‌మెన్ కొట్టిన షాట్లను ఎదురొడ్డి అడ్డుకున్నారు. రెండు పరుగులు రావాల్సిన చోట ఒకటి, బౌండరీ వెళ్లాల్సిన బంతిని రెండు పరుగులకు నిరోధించగలిగారు.

ఉత్తమ కెప్టెన్సీ

కెప్టెన్‌గా, ఆటగాడిగా, వికెట్ కీపర్‌గా ధోనీకి వందకు వంద మార్కులు వేయాల్సిందే. జట్టు ట్రోఫీ సాధించడంలో అతడి అపార అనుభవం తోడ్పడింది. కీలక సమయాల్లో సరైన నిర్ణయాలతో జట్టును విజయపథాన నడిపించాడు. బౌలింగ్ వనరులు పరిమితంగా ఉన్నప్పటికీ బౌలర్లను వాడుకున్న తీరు అద్భుతం. బౌలింగ్‌లో సరైన సమయంలో సరైన మార్పులు చేశాడు. బ్యాటింగ్‌పై వచ్చిన విమర్శలకు ఫైనల్లో బ్యాట్‌తోనే జవాబు చెప్పాడు. ధోనీ నాయకత్వంలో భారత్ భారీ టోర్నమెంట్లలో గెలిచిన అనుభవం ఉంది. ఇతర కెప్టెన్లందరి కంటే ధోనీలో గెలవాలన్న కసి ఎక్కువ. జట్టు సహచరులంతా 'మహి' అని ప్రేమగా పిలుచుకునే 'మెన్ ఇన్ బ్లూ' ధోనీ అత్యుత్తమ కెప్టెన్‌గా నిలిచాడు.

"భారత్ ఓడిపోతే జట్టులో అందరికంటే ఎక్కువగా బాధపడేది ధోనీనే" రిటైర్మెంట్ సందర్భంగా కోచ్ కిర్‌స్టన్.

"భారత్ ప్రపంచ కప్ సాధించడంలో జట్టు సమిష్టి కృషి ఉంది. అయితే ప్రశాంత, సమయోచిత నిర్ణయాలతో ధోనీ సమర్థుడైన కెప్టెన్‌గా వ్యవహరించాడు. నా అభిప్రాయం ప్రకారం ప్రస్తుత ప్రపంచ క్రికెట్‌లో ధోనీ అత్యుత్తమ కెప్టెన్. క్రికెట్‌పై అద్భుత అవగాహన కలిగి ఉన్న ధోనీ సమయోచిత నిర్ణయాలు తీసుకోవడంలో దిట్ట. రిస్క్ ఉన్నప్పటికీ ఫైనల్ మ్యాచ్‌లో ఐదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగాలని తీసుకున్న నిర్ణయం ధైర్యంతో కూడుకున్నది. ఆచితూచి బ్యాటింగ్ చేసి జట్టును విజయపథాన నడిపించడం ద్వారా తన బాధ్యతను దిగ్విజయంగా నిర్వర్తించాడు" -మాజీ కోచ్ గ్రెగ్ చాపెల్.

"దేశంలో గల ఉత్తమ కెప్టెన్ ధోనీ. అతని రికార్డే దాన్ని నిరూపించింది. ధోనీ నాయకత్వంలో ట్వంటీ 20 ప్రపంచ కప్, ఆసియా కప్ కూడా సాధించాం. టెస్టుల్లో అతని నాయకత్వంలోనే నెంబర్ వన్ ర్యాంకు సాధించాం. ఇప్పుడు వన్డేల్లో ప్రపంచ కప్ సాధించాం. దీన్నిబట్టే భారత జట్టు కెప్టెన్లలో అతడే అత్యుత్తముడని చెప్పవచ్చు" - మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ.

"నేను ఎంతో మంది కెప్టెన్ల వద్ద ఆడాను. అందులో ధోనీ అత్యుత్తమ నాయకుడు. అతడు చూపించిన పరిణతి, కీలక సమయాల్లో తీసుకున్న నిర్ణయాలు అద్భుతం. అతడు పరిస్థితిని సరిగ్గా అంచనా వేసి తదనుగుణంగా ఎత్తుగడలు వేయడంలో దిట్ట. ఎలాంటి క్లిష్ట పరిస్థితిలోనైనా ఆవేశానికి లోనుకాకుండా జట్టును ముందుకు నడిపించడం అతడి ప్రత్యేకత. అత్యుత్తమ కెప్టెన్‌కు ఉండాల్సిన లక్షణాలన్నీ అతడికున్నాయి"- సచిన్ టెండూల్కర్

కోచ్ సత్తా

ధోనీ, కిర్‌స్టన్ కాంబినేషన్ జట్టును అగ్రస్థానానికి తీసుకెళ్లింది. కోచ్‌గా కిర్‌స్టన్ మూడున్నరేళ్ల మాత్రమే సేవలందించాడు. అయినా గ్రెగ్ చాపెల్ అథమ స్థానానికి తీసుకెళ్లిన జట్టును అగ్రస్థానానికి చేర్చాడు. ఇతని కాలంలో టెస్టుల్లో నెంబర్ వన్ ర్యాంకు సాధించిన భారత్ వన్డేల్లో నెంబర్ టూగా నిలిచింది. ఇప్పుడు ప్రపంచ కప్ సాధించడం ద్వారా నెంబర్ వన్‌గా అవతరించింది. ట్వంటీ20 టోర్నీలోనూ ప్రపంచ కప్ సాధించి అగ్రస్థానానికి దూసుకెళ్లింది. విదేశాల్లో టీం ఇండియాను అజేయ శక్తిగా నిలిపిన కిర్‌స్టన్ కప్ కోసం 28 ఏళ్ల నిరీక్షణకు తెర దించాడు. అతడు ఒక కోచ్‌గా కంటే జట్టుకు వైద్యుడిగా సేవలందించాడు. అంటే జట్టు ఏ విభాగంలో బలహీనంగా ఉందో గుర్తించి దాన్ని మరమ్మతు చేశాడు. ఉదాహరణకు... దక్షిణాఫ్రికాలో సిరీస్‌కు ముందు అక్కడి పిచ్‌లపై అవగాహన కోసం కేప్‌టౌన్‌లోని తన అకాడమీలో బ్యాట్స్‌మెన్‌కు తర్ఫీదునిచ్చాడు. ప్రపంచ కప్‌లో లీగ్ దశను దాటేందుకే అష్టకష్టాలు పడిన భారత్ క్వార్టర్స్, సెమీస్, ఫైనల్ గండాలను అవలీలగా గట్టెక్కడంలో కిర్‌స్టన్ చిట్కా పనిచేసింది. టీం ఇండియాలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు సాహస యాత్రికుడు, ప్రేరణ గురు మైక్ హార్న్‌ను దక్షిణాఫ్రికా నుండి హుటాహుటిన రప్పించాడు.

కోచ్‌గా కిర్‌స్టన్ (వన్డేల్లో)

మ్యాచ్‌లు - 90, గెలుపు - 56, ఓటమి - 29, టై - 1, ఫలితం తేలనివి - 4, విజయాల శాతం - 62.22

సచిన్‌కు అంకితం

జట్టులో అత్యంత సీనియర్ బ్యాట్స్‌మన్ అయినప్పటికీ యువ ఆటగాళ్లతో పోటీపడి పరుగులు చేశాడు. కెరీర్‌లో చివరి ప్రపంచ కప్ ఆడుతున్న సచిన్ పట్టుదలతో ఆడి కోట్లాది మంది అభిమానులను అలరించాడు. వీరేంద్ర సెహ్వాగ్‌తో కలిసి చక్కటి ఆరంభాన్ని అందిస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. పాకిస్తాన్‌తో



సెమీఫైనల్లో కీలక ఇన్నింగ్స్ ఆడి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' కోసం యువరాజ్ సింగ్‌తో చివరి వరకూ పోటీ పడ్డాడు. వరుసగా ఐదవ వరల్డ్ కప్ ఆడుతూ.. జట్టులో పెద్ద దిక్కుగా అందరికీ సూచనలిస్తూ... ఆటగాడిగా తన వంతు కృషి కూడా సమర్థవంతంగా నిర్వహించాడు. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే సచిన్ అంతే ప్రశాంతతతో కప్ అందించాడు. సచిన్‌కు ప్రపంచ కప్‌ను కానుకగా అందించడంతోనే అతడిపై సహచరులకు గల గౌరవం తెలుస్తోంది. కప్ సాధించిన తర్వాత కోచ్ కిర్‌స్టన్ కంటే ముందు సచిన్‌ను ఆటగాళ్లు తమ భుజాలపై ఎత్తుకొని మైదానమంతా కలియతిరిగారు.

సచిన్ : మ్యాచ్‌లు - 9, పరుగులు - 482, సగటు - 53.55

సమిష్టి విజయం

జట్టును ఒంటి చేత్తో గెలిపించిన ఘటన ఈ టోర్నీలో కనబడకపోవడం మరో విశేషం. అంటే ఆటగాళ్లంతా సమిష్టిగా కష్టపడి కప్ అందించారు. అందుకే బౌలింగ్‌లో విఫలమైనప్పుడు బ్యాట్స్‌మెన్, బ్యాటింగ్‌లో విఫలమైనప్పుడు బౌలర్లు గెలుపు బాధ్యతను పైన వేసుకున్నారు. ఆసీస్ నిర్దేశించిన 260 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో బ్యాట్స్‌మెన్, పాక్‌ను 231కు కట్టడి చేయడంలో బౌలర్లు, ఫైనల్లో లంకను కట్టడి చేయడంలో ఫీల్డర్లు, ఇంగ్లండ్‌తో మ్యాచ్ టై కావడంలో బౌలర్లు, ఫీల్డర్లు నిర్వహించిన పాత్ర మరువలేనిది. అందుకే ఈ కప్‌ను ఏ ఒక్కరో అందించారనడం కన్నా... సమిష్టి విజయం అనడం సందర్భోచితం.

అనుకూలమైన డ్రా

భారత్‌కు డ్రా కూడా అనుకూలించింది. అందుకే లీగ్ దశలో తడబడినప్పటికీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగలిగింది. ఐర్లాండ్, జింబాబ్వే, నెదర్లాండ్స్‌లపై గెలవగానే క్వార్టర్స్ స్థానం ఖాయమైంది. ఇంగ్లండ్‌తో టై చేసుకున్నా, దక్షిణాఫ్రికా చేతిలో ఓడినా క్వార్టర్స్ స్థానానికి ఢోకా లేకపోయింది. మరో విశేషమేమిటంటే సెమీఫైనల్లోకి ప్రవేశించిన జట్లలో భారత్ మాత్రమే గ్రూప్-బి నుండి వచ్చింది. మిగిలిన మూడు జట్లు గ్రూప్-ఎకు చెందినవే. అంటే లీగ్ దశలో ఎదుర్కోనందున మూడు జట్లకు భారత్

తొలి ప్రపంచ కప్

1983 ప్రపంచ కప్‌ను కపిల్ దేవ్ నేతృత్వంలోని డేర్ డెవిల్స్ కైవసం చేసుకుంది. ప్రుడెన్షియల్ కప్‌గా పిలిచిన ఆ టోర్నీ ఫైనల్లో వెస్టిండీస్‌ను ఓడించింది. ఎనిమిది జట్లు పాల్గొన్న ఆ టోర్నీ జూన్ 9 నుండి 25వ తేదీ వరకు ఇంగ్లండ్‌లో జరిగింది. 60 ఓవర్ల ఆ టోర్నీలో ప్రారంభం నుండే సంచలనాత్మక ఫలితాలు నమోదయ్యాయి. అండర్‌డాగ్‌గా ప్రవేశించిన భారత్, జింబాబ్వే జట్లు వెస్టిండీస్, ఆస్ట్రేలియాలను మట్టికరిపించడం విశేషం. సెమీఫైనల్లోకి ఇంగ్లండ్, పాకిస్తాన్, భారత్, వెస్టిండీస్ ప్రవేశించాయి. ఫైనల్లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 183 పరుగులకు ఆలౌట్ అయింది. మొహిందర్ అమర్‌నాథ్ బౌలింగ్‌లో విజృంభించి మూడు వికెట్లు తీయడంతో విండీస్ 140 పరుగులకే ఆలౌట్ అయింది. జింబాబ్వేతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత్‌ను కపిల్ దేవ్ (175 నాటౌట్) కెప్టెన్సీ గెలిపించింది.

కప్పుతో కపిల్...

అంకెల గారడీ

➡ భారత్ ప్రపంచ కప్ సాధించి నేటికి సరిగ్గా 28 ఏళ్లు. అంటే 2+8=10. సెమీస్ జరిగింది 30-3-2011న. అంటే 3+3+2+1+1=10. ఫైనల్లో భారత్ మరో పది బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు మిగిలిన పది మంది ఆటగాళ్లు ఈ కప్పును కానుకగా ఇచ్చారు. సచిన్ ధరించే జెర్సీ నెంబర్ కూడా 10.

➡ క్రికెట్‌లో భారత్ జైత్రయాత్ర 1983లో ప్రారంభమైంది. కపిల్ డెవిల్స్ నేతృత్వంలో తొలిసారి ప్రపంచ కప్ సాధించిన భారత్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకొంది కూడా. రెండేళ్ల తర్వాత జరిగిన బెన్సన్ అండ్ హెడ్జెస్ వరల్డ్ సిరీస్ కప్ సాధించి 1983 ప్రపంచ కప్ ఆషామాషీ కాదని నిరూపించింది. 1993లో జరిగిన సిఎబి జూబ్లీ కప్ విజేతగా నిలిచిన భారత్ మరో ప్రధాన టైటిల్ కోసం తొమ్మిదేళ్లు నిరీక్షించాల్సి వచ్చింది. 2002లో ఛాంపియన్స్ ట్రోఫీ హస్తగతం చేసుకుంది. తర్వాత మరో తొమ్మిదేళ్ల తర్వాత రెండోసారి ప్రపంచ కప్ కైవసం చేసుకుంది. దీంతో తొమ్మిది సెంటిమెంట్ పుట్టుకొచ్చింది.

➡ గత 30 ప్రధాన టోర్నమెంట్లలో ఆస్ట్రేలియా 11 సార్లు ఛాంపియన్‌గా నిలిచింది. అందులో రెండు ప్రపంచకప్‌లు కూడా ఉన్నాయి. ఇదే అత్యుత్తమ రికార్డు. వెస్టిండీస్ నాలుగు ప్రపంచ కప్‌లతో కలిసి ఎనిమిది టోర్నమెంట్లు సాధించింది. పాకిస్తాన్ ఐదింటిలో (ఒక ప్రపంచ కప్ సహా), భారత్ ఐదింటిలో (రెండు ప్రపంచ కప్‌లు సహా) విజేతగా నిలిచింది. శ్రీలంక రెండు టోర్నమెంట్లలో మాత్రమే (1996 ప్రపంచ కప్ సహా) విజయం సాధించింది.

➡ వెస్టిండీస్‌కు 1987 వరకే గోల్డెన్ పీరియడ్. పాకిస్తాన్‌కు 1986-1994 వరకు గోల్డెన్ పీరియడ్.

➡ శ్రీలంక ఐదు అంతకంటే ఎక్కువ జట్లు పాల్గొన్న భారీ టోర్నమెంట్లలో 2004లో (ఆసియా కప్) తొలిసారి విజయం సాధించింది. తర్వాత 2006లో ప్రపంచ కప్ మాత్రమే.

ఆటపై అంతగా అవగాహన లేదు. ఇది భారత జట్టుకు వరంగా పరిణమించింది.

స్వదేశీ బలం

ఏ జట్టుకైనా స్వదేశంలో ఆడటం బలాన్నిస్తుంది. అయితే విఫలమవుతున్నప్పుడు అదే బలహీనంగానూ మారుతుంది. ప్రస్తుత భారత జట్టుకు స్టేడియంలో స్వదేశీ అభిమానులు అందించిన ఛీర్స్ కొండంత బలాన్నిచ్చింది. టోర్నీ జరిగినన్ని రోజులూ భారత ప్రజలు క్రికెట్‌ను మినహా మరే విషయాన్నీ పట్టించుకోలేదు. ఆ 45 రోజులూ, ప్రధానంగా లీగ్ దశ దాటినప్పటి నుండి ఏ గల్లీలో చూసినా, ఏ చౌరస్తాలో చూసినా క్రికెట్ గురించే చర్చలు. క్వార్టర్ ఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించగానే మన జట్టును అభిమానులు ఆకాశానికెత్తేశారు. జట్టు ప్రపంచ కప్పును అప్పుడే సాధించినట్లు సంబరపడ్డారు. జట్టు కప్ సాధించకుండా ఏ శక్తీ అడ్డుకోలేదని అంచనాలు కూడా వేసేశారు. క్లబ్బులు, రెస్టారెంట్లు, పబ్బులకే పరిమితమైన లైవ్ టెలికాస్ట్ స్క్రీన్స్ భారత్ సెమీస్‌కు చేరినప్పటి నుండి రోడ్ల కూడలిపై, సినిమా హాల్లో, భారీ స్టేడియాల్లోనూ దర్శనమిచ్చాయి. పాక్, శ్రీలంకలతో మ్యాచ్‌లు జరుగుతున్నంత సేపూ రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. ప్రజల్లో ఏ విషయంలోనైనా భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు గాక... భారత్ ప్రపంచ కప్ సాధిస్తుందనడంలో మాత్రం ఏకాభిప్రాయాన్ని కనబర్చారు. ఈ విషయంలో వారిలో క్రీడా స్ఫూర్తి, దేశ భక్తి పరిఢవిల్లింది. ప్రజలంతా కలిసికట్టుగా భారత జట్టుకు జై కొట్టారు. జాతి, మత, కులాలకతీతంగా ప్రతి ఒక్కరూ భారతీయుడిగా గర్వపడ్డారు.

వెల్లివిరిసిన క్రీడా స్ఫూర్తి

భారత్, పాకిస్తాన్ మ్యాచ్ జరుగుతున్నప్పుడు స్టేడియంలో ప్రేక్షకులు 'ఎప్పటికీ స్నేహితులమే' అనే బ్యానర్‌ను పదేపదే ప్రదర్శించారు.

ఇరుదేశాల ప్రజలూ సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు మొహాలీ ఒక సందేశాన్ని ఇచ్చింది. క్రికెట్... అందర్నీ కలిపే ఆట. ఇద్దరు ప్రధానులనూ ఒక దగ్గరకు చేర్చింది. **- భారత్ ప్రధాని మన్మోహన్ సింగ్**

ప్రపంచ కప్ సాధించిన భారత జట్టుకు అభినందనలు. క్రికెట్ దౌత్యంతో సమీప భవిష్యత్తులో రెండు దేశాల సంబంధాలు కూడా పటిష్టమవుతాయని ఆశిస్తున్నాను. రెండు దేశాల మధ్య శాంతి సౌభ్రాతృత్వాలు, పరస్పరం విశ్వాసం కల్పించడంలో మొహాలీ చర్చలు కీలక పాత్ర పోషించాయి. ద్వైపాక్షిక సంబంధాల్లో మొహాలీ చర్చలు ఓ మైలురాయిగా నిలుస్తాయి.



ఇరుదేశాల సంబంధాలను మెరుగుపరచడంలో మొహాలీ చర్చలు ఫలవంతమయ్యాయి. మన్మోహన్‌తో చర్చలు ఫలప్రదంగా జరిగాయి.

- పాక్ ప్రధాని యూసఫ్ రజా గిలానీ.

ప్రపంచ కప్ సాధించిన 121 కోట్ల మంది భారత ప్రజల ఆనందోత్సాహాల్లో మా చిన్న దేశంలో గల 20 లక్షల మంది కూడా భాగం పంచుకుంటున్నారు. రెండోసారి ప్రపంచ కప్ సాధించిన భారత్‌కు హృదయపూర్వక అభినందనలు. **- శ్రీలంక అధ్యక్షుడు రాజపక్స**

ఫైనల్లో ఓడిపోయినప్పటికీ శ్రీలంక ఆటగాళ్లను ఆ దేశ అధ్యక్షుడు రాజపక్స సన్మానించారు. ఆయన భార్య శిరాంతి తమ దేశ క్రికెటర్లకు ఐదు వేల రూపాయల బంగారు నాణెం, ఒక జత బంగారు కడియాలు బహూకరించారు. "మీరు కప్ సాధించినా సాధించకున్నా... ఫైనల్లోకి వెళ్లడమే ఘనకార్యం. ఓటమి బాధించినప్పటికీ శ్రీలంకన్లు హుందాగా స్వీకరించారు" **- శ్రీలంక అధ్యక్షుడు రాజపక్స తన దేశ ఆటగాళ్లతో అన్నారు.**

మేం మరిన్ని వికెట్లు తీసి ఉండాల్సింది. మొత్తం మీద ఉత్తమ జట్టు విజయం సాధించింది. ఓటమికి బాధపడ్డాం. అయితే అది అప్పటి మట్టుకే. కప్ సాధించిన భారత జట్టుకు మా అభినందనలు **- శ్రీలంక జట్టు కెప్టెన్ సంగక్కర.**

ఫైనల్లోకి ప్రవేశించిన భారత జట్టుకు, ఆ దేశ ప్రజలకు నా అభినందనలు. ఆ జట్టు బాగా ఆడింది. విజయానికి వాళ్లు అర్హులే. మా ఫీల్డింగ్ ఘోరంగా ఉంది. ఒత్తిడిని తట్టుకోలేకపోయాం. ఫైనల్లోనూ భారత్ విజయం సాధించాలని కోరుకుంటున్నాను. అదే సందర్భంలో మా దేశ ప్రజలకు క్షమాపణలు అడుగుతున్నాను. మేం విజయానికి శాయశక్తులా కృషిచేశాం. ఈ టోర్నీలో మా జట్టు ఆటతీరుపై సంతృప్తిగా ఉన్నాం. **- సెమీస్‌లో ఓటమి తర్వాత పాకిస్తాన్ జట్టు కెప్టెన్ షాహిద్ అఫ్రిదీ.**

★

కథ

నీవు ఇక్కడకు రావద్దు...

-భమిడిపాటి గౌరీశంకర్

ఆకాశం మేఘావృతమై ఉంది... ఎక్కడో వర్షం కురుస్తోంది... మెరుపులు.. శబ్దం లేకుండా... మనిషి జీవితంలో చెప్పిరాని కష్టాల్లా అప్పుడప్పుడు వెలుగులను చిమ్ముతున్నాయి...దూరంగా చెట్టుపైన ఒంటరి కాకి.. అదే పనిగా అరుస్తోంది. విసుగు చెందిన ఎవరో చిన్న రాయితో కొట్టినట్లున్నారు. ఎగిరిపోయింది. బందిఖానా జీవితంలో సుఖదుఃఖాలు.. చీకటి వెలుగులు... రాత్రి పగలు ఒకటే... నిర్దేశించిన సమయంలో ప్రణాళికతో జీవితం... కాల పరీక్ష నాళికలో పరీక్షించబడుతూ... ఒకే మూసలో... నత్తలో గుల్లలా సా...గి... పోతూనే ఉంటుంది. దీన్ని గురించి దుఃఖం, సంతోషం ఏమీలేని ఓ మానసిక శూన్యత...మెటాఫిజికల్ ఎమ్టీనెస్...

'వర్షం వచ్చేలా ఉంది. లోపలకు వెళ్లండి మాష్టారూ.. మీ ఆరోగ్యానికి మంచిది కాదు...' సూపర్‌వైజర్ జాగ్రత్త.. ఆ జాగ్రత్త మాష్టారి ఆరోగ్యం కోసమా.. తన ఉద్యోగాన్ని నిలుపుకోవడం కోసమా.. ప్రతి విషయాన్నీ ఇలా ఎందుకు ఆలోచించాలి... అతను నిజంగా మాష్టారిపై ప్రేమతోనే చెబుతున్నాడేమో... ప్రేమ అనుకోగానే నవ్వు వచ్చింది మాష్టారికి... మౌనంగా నవ్వుకున్నాడు.

బిడ్డలపైన ప్రేమ తప్పా? కొడుకును అమితంగా ప్రేమించడం తప్పా...? అతడిని ఉన్నతుడిగా తీర్చిదిద్దడం తప్పా..? ఏది తప్పు? ఇందులో ఏదీ మాష్టారికి తప్పుగా కనపడలేదు... కానీ నాణేనికి మరో పార్శ్వం ఉందనే ఆలోచన ఆయనకెన్నడూ కలగలేదు. ప్రేమతో అతని అంతరంగిక జీవితంలోకి ఎన్నో సార్లు ప్రవేశించి ఉంటారు మాష్టారు. సత్యాన్ని తెలుసుకోలేక పోయారు... అసత్యాన్ని సత్యం చేయడానికి ప్రయత్నించి ఓడిపోయారు... ఆయన నిజంగా ఓడిపోయారా!? అయినా సమస్యను ఒకవైపు నుండి మాత్రమే ఆయన పరిశీలిస్తున్నాడనిపిస్తుంది. మాష్టారిగా పాతికేళ్ల సర్వీసు, మనిషిగా అరవై సంవత్సరాల జీవితానుభవం ఆయననెందుకు స్వార్థపరుణ్ణి చేస్తున్నాయి? ఏది స్వార్థం.. ఏది కాదు.. తత్వవిచారణ చేసే సమయమిదా!?

◆◆◆

వర్షం జోరుగా కురుస్తోంది. శ్రీను చిత్తు పుస్తకంలోంచి కాగితాలను చించి పడవలు చేసి ప్రవహిస్తున్న నీటిలో వేస్తున్నాడు. అవి వేగంగా పోతుంటే నవ్వుతున్నాడు.

"వర్షానికి తడిస్తే జలుబు చేస్తుందిరా నాన్నా.. అమ్మ కూడా లేదు కదా... అమ్మమ్మ వాళ్ల ఇంటికెళ్లింది. రేపు బడికి వెళ్లడం కష్టం. అయినా ఆ హోమ్‌వర్కు పూర్తి చేయకూడదూ. లేదంటే దెబ్బలు పడతాయి కదా..." మాష్టారి గొంతులో కాస్త కఠినం... మరి కాస్త మార్దవం జోడించి హెచ్చరించారు. శ్రీను ఆయన ముఖంలోకి అదోమాదిరిగా చూశాడు. ఆ చూపులో ఏదో తెలియని నిరసన నాయనకు కనిపించింది. అది సహజమే అనుకున్నాడాయన.

శ్రీను వెళ్లి పుస్తకాలను ముందేసుకుని సీరియస్‌గా వర్కు చేసుకుంటున్నాడు. అతని కళ్లలో ఏదో విషాదం... ఎందుకు? అతని సంతోషాన్ని మాష్టారు పాడుచేశాడనా? క్రమశిక్షణలో పెట్టడం తప్పా! వాడి భవిష్యత్తు కోసమే కదా ఈ జాగ్రత్త. అయినా ప్రతిపనీ పిల్లలను అడిగే చేస్తామా...

శ్రీనుని డాక్టరు చేయాలన్నదే మాష్టారి ఆశ. ఆయనను డాక్టరుగా చూడాలనుకుంది తల్లి. కానీ కుటుంబ పరిస్థితులు, ఆర్థికపరమైన ఇబ్బందులు.. ఆయనను టీచర్ని చేశాయి. బతకలేక బడి పంతులని అందరూ వెక్కిరించారు. ఆరోజులు అటువంటివి. తల్లి చనిపోతూ "కన్నా... నా మనవడినైనా డాక్టరుని చేయరా" అని కోరింది. ఆయన ఆమెకు మాటిచ్చాడు. అందుకే ఆయనకు అంత తపన.

కానీ శ్రీను ఎందుకు గ్రహించడు? అయినా గ్రహించే వయసు అతనికేది. ఇంకా పదవతరగతే చదువుతున్నాడు. చిన్న పిల్లాడు... మాష్టారిగా, తండ్రిగా అతడిని తీర్చిదిద్దవలసిన బాధ్యత ఆయనకుంది. వాడికి ఇష్టం లేకున్నా సరే. తన నిర్ణయం మారదనుకున్నాడు మనసులో.

"ఏంటి గతంలోకి వెళ్లి వస్తున్నారా?" మాష్టారి భుజం తడుతూ రూమ్మేట్ రామచంద్ర అన్నాడు.

"ఆ... కాదు... కాదు..." ఆయన గొంతులో తడబాటు.

"ఎందుకు మాష్టారు తడబాటు... మనలాంటి ముసలాళ్లకు జ్ఞాపకాలే కదా జీవశక్తి కేంద్రాలు... దానికి సిగ్గు పడడం దేనికి.. హాయిగా నవ్వుతూ అన్నాడు.

ఎంత చక్కగా నవ్వుతున్నాడు. అతనో పదవీ విరమణ చేసిన తెలుగు అధ్యాపకుడు.. ఇద్దరు కూతుళ్లు. ఇద్దరూ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్నారు. అతని భార్య ఈ మధ్యనే చనిపోయింది.

"నా భార్య ఒంటరిగా పోయి నన్ను మరింత స్వతంత్రుణ్ణి చేసింది మాష్టారు" అంటాడు నవ్వుతూ.

మాష్టారు ఆయన ముఖంలోకి చూశాడు. కళ్లలో నీరు, ఆయన భుజంపై చేయి వేసి పదండి అన్నారు.

మౌనంగా ఇద్దరూ డైనింగ్ హాలుకు వచ్చారు. భోజనాల గది సందడిగా ఉంది. రామచంద్ర మామూలు మూడ్‌లోకి వచ్చాడు. రాజేష్‌ఖన్నా 'ఆరాధన'లోని "మేరీ సప్నోంకి..." అనే పాటను హమ్ చేస్తున్నాడు.

"భోజనం చేయండి మాష్టారు.. మనం ఆలోచించుకునేందుకు ఇంకా చాలా సమయముంది కదా. అయినా తెల్లవారి నిద్ర లేచిన దగ్గర్నుండి రాత్రి నిద్రపోయే వరకు మనం చేసే పని ఏముంది కనుక. నెలకింత అని చెల్లించి హాయిగా తింటూ గతాన్ని తలచుకోవడమే కదా మన పని" రామచంద్ర కామెంట్.

ఆయనకెందుకో అతని కామెంట్ నచ్చలేదు.

రామచంద్రకు మాష్టారి ముఖంలో భావాలు తెలిసినట్లున్నాయి. "నేను చెప్పిందాంట్లో ఏమయినా తప్పుందా?" అడిగాడు.

"చెప్పినదాంట్లో కాదు... చెప్పే విధానంలో" అని సరిదిద్దాడాయన చిన్నగా నవ్వి.

రామచంద్ర గట్టిగా నవ్వి "మొత్తమ్మీద తెలుగు సారనిపించుకున్నారు"

అదేదో సినిమాల్లో అన్నట్లు టేపురికార్డరు మాదిరిగా జీవితానికి కూడా రివైండ్ బటన్ ఉంటే ఎంత బాగుండునో... ఆయన పెదాలపై నవ్వు.

"ఏంటి.. మళ్లీ ఫ్లాష్‌బ్యాకా"

"కాదు... ఫ్రంటే"

"అర్థం కాలేదు" రామచంద్ర సందేహం.

"ఏం లేదు... తమ జీవితాల్లోని సుఖాలను వెతికి పట్టుకునే సమయంలో వాటిని మూర్ఖపు ఆలోచనలతో కాలాన్ని ఎందుకు వ్యర్థం చేశానా అని ఆలోచిస్తున్నా..."

"దానివల్ల ప్రయోజనం"

"ఏమీ లేకపోవచ్చు. కానీ మానసికానందం కలుగుతుంది కదా! అంతకన్నా ఏం కావాలి?" నిద్ర సమయాన్ని సూచిస్తూ గంట కొట్టారు.

"తరంగ్" వృద్ధాశ్రమంలో మరో రోజు ము...గి...సిం...ది.

◆◆◆

"అది కాదురా... ఆ పిల్ల కులం, గోత్రం వంటివి పక్కన పెట్టు. అమ్మకు తడీ... మడీ... ఆచారం ఎక్కువ కదా. ఆ విషయం గురించి ఆలోచిస్తున్నా"

"అబ్బా నీకేమీ తెలియదు నాన్నా... అవన్నీ నేను చూసుకుంటాను కదా. అమ్మను ఎలా ఒప్పించాలో నాకు తెలుసు. ఇంకా నీ చేయి పట్టుకుని నడిచే చిన్నపిల్లాడిని అనుకుంటారు మీరు..." శ్రీను మాటల్లో కరుకుదనం.

నిజమే తల్లిదండ్రులు బిడ్డలను కంటారు. పిల్లలు పెద్దవాళ్లవుతుంటారు. కానీ తండ్రులు మాత్రం పిల్లలుగానే ఉండిపోతారు. ఆ రాత్రి తన భార్యకు నచ్చచెప్పాడు కోడలి గురించి. అది విన్న కొడుకు మరోసారి తనను తీర్చి దిద్దిన తండ్రిని తలచుకుని ఆనందించాడు. అది కూడా కొంతసేపే. 'ఎవరికోసం?' అనే ఆలోచన అతన్ని ఆక్రమించింది.

◆◆◆

ఓ పెద్ద రాబందు తన నుంచి దేన్నో దూరం చేస్తున్నది. ముందు మౌనంగా ఊరకుండిపోయాను. అది తనను కూడా ఎత్తుకుపోయేందుకు ప్రయత్నిస్తోంది. ఒకటి... రెండు... మూడు... వందలు... వేల రాబందులు తనను బతికి ఉండగానే పీక్కు తింటున్నాయి. రెండు చేతులతో వాటిని వదిలించుకోవడం సాధ్యం కావడం లేదు. తన భార్య పెద్ద కర్ర తెచ్చి వాటిని అదిలిస్తోంది. కొన్ని గుంపుగా ఆమె మీదకు వెళ్లాయి. ఆమె తనను వదిలి వెళ్లిపోతోంది. తనను రక్షించేవారు లేరా అని అరుస్తున్నాడు. ఇంతలో ఓ ఆజానుబాహుడు పెద్ద కళ్లతో... గుండుతో... నాలుగు చేతుల్లో నాలుగు పదునైన కత్తులతో రాబందుల గుంపుపైన దాడి చేస్తున్నాడు. అవి అతన్ని పొడుస్తున్నాయి. అతని శరీరం నిండా గాయాలు... రక్తం... అయినా అతను పోరాడుతున్నాడు. చివరికి అతను విజయం సాధించాడు. తనను రక్షించాడు. ఆ తర్వాత తను స్పృహ కోల్పోయాడు.

కల... భయంకరమైన కల. శ్రీను కళ్లు తెరిచి చూశాడు. భయంతో అతని శరీరం చెమటలు పట్టింది. పక్కకు తిరిగి చూశాడు. భార్య నిశ్చింతగా నిద్రపోతోంది. తను తప్పు చేశాడా... ఎందుకీ కల? నాన్నగారెలా ఉన్నారో... ఆ రోజు అతనికింకా గుర్తుంది.

“అమ్మా! తను ఈ పల్లెటూర్లో ఉండలేనంటోంది. డాక్టర్ చదువుకున్న నాకూ ఇక్కడ సరైన గుర్తింపు లేదు. నాన్నగారి ఆశయం నెరవేర్చలేననే సందేహం” తను నసుగుతూ చెప్పిన మాట తల్లి గుండెను తీవ్రంగానే తాకింది.

“అంటే నీ ఉద్దేశ్యం మమ్మల్ని వదిలేసి నువ్వు వెళ్లిపోతానంటావు అంతేనా. నీ చదువు కోసం ఈ ఇల్లు, పొలం తాకట్టులో ఉన్నాయి. డాక్టర్‌వి కదా అని అప్పు ఇచ్చిన వారు ఊరుకుంటున్నారు. ఇప్పుడు ఇలా నువ్వు వెళ్లిపోతే నాన్నగారి కొచ్చే అరకొర పింఛనుతో అవెలా తీరతాయి” తల్లి అరుపులు.

“అది కాదమ్మా.. ఈ ఇల్లు, పొలం అమ్మేద్దాం. వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చేద్దాం. మిగిలిన డబ్బులతో మీరు మాతోనే హైదరాబాద్ వచ్చేస్తే అందరం కలిసి హాయిగా ఉందాం”

మాష్టారు లోపలికి వస్తూనే “ఏంట్రా...” అనడిగాడు.

“చూడండి. వీడు మనల్ని వదిలి వెళ్లిపోతాడట” ఆవేదనతో అంది తల్లి.

“వెళ్లనీ. ఏం? మన పెళ్లి తర్వాత మనం వచ్చేయలేదు. నిన్న మనం. ఈ రోజు వీళ్లు. రేపు వాళ్ల పిల్లలు... ఇదో చక్ర భ్రమణం. పద అన్నం వడ్డించు” గబగబా పెరట్లోకి వెళ్లిపోయిన తండ్రి.. గమనించి ఉంటే ఆయన కళ్లలో నీళ్లు శ్రీనుకు కనిపించి ఉండేవేమో...

ఆ రాత్రి... “ఏవండీ... మీరు వాడినే సమర్థిస్తున్నారు”

“సరూ...! ఒక్క మాట చెప్పనా. వేలాది సంవత్సరాలుగా సంఘర్షణ అనేది ఈ భూమ్మీద జరుగుతూనే ఉంది. ముఖ్యంగా తండ్రీ కొడుకుల మధ్య. కొడుకు తండ్రిని, తండ్రి కొడుకుని నొప్పించడం



తరచుగా ఎదురయ్యే సంఘటన. నిన్న, నేడు, రేపు... ఎప్పుడూ ఉంటుంది. మనిషి తాను సంతుష్టుడైన నాడు తోటి మానవులకు లేదా కుటుంబ సభ్యులకు ప్రయోజనం చేకూర్చగలుగుతాడు. సంతోషం లేని వ్యక్తి కుటుంబానికి, సమాజానికి కూడా భారమే. కనుక ముందు తనకు తాను ఆనందమయ జీవితాన్ని తీర్చి దిద్దుకోవడం ప్రధాన కర్తవ్యం. మన శ్రీను చేస్తున్నదదే. వాడి సంతోషం వాడు వెతుక్కుంటున్నాడు. వాడు చెప్పిన విధంగానే కొన్నాళ్లు చూద్దాం. కాదంటే మరో మజిలీ”

తండ్రి మాటలు శ్రీనుకు ఎందుకో వ్యంగ్యంగా అనిపించాయి. అయితే ఆయన నోటి నుంచి వచ్చిన ‘మరో మజిలీ...’ అన్న మాట... ఆమెకు చివరి మజిలీ అయింది.

కోడలి సణుగుడు పడలేక..కొడుకుతో చెప్పుకోలేక... నిద్రాహారాలు కరువై చివరకు శాశ్వత నిద్రలోకి జారిపోయింది. మాష్టారు ఏమీ చెయ్యలేక మౌనం ఆశ్రయించాడు. మరునాడే ఆయన్ని “తరంగ్” వృద్ధాశ్రమంలో చేర్పించాడు శ్రీను.

అక్కడకు చేరగానే మాష్టారు “బాగుందిరా పేరు... తరంగ్ అంటే అర్థం తెలుసా?” అనడిగారు.

శ్రీను తెలియదన్నట్లు తలూపాడు.

“సముద్ర అలలపై నిరంతర ప్రయాణం చేస్తూ ఎన్నో రకాలుగా సేవలందించి కాలం తీరిన నౌకలను, చివికి పోయి పాడయిపోయిన వాటిని శాశ్వతంగా వదిలించుకునే నౌకా విశ్రాంతి కేంద్రం పేరు అది. వృద్ధులు కూడా ఆ నౌకల్లాంటివారే” అన్నాడాయన.

రిక్షా దిగిన తండ్రికి చేయందించి... వృద్ధాశ్రమం వైపుగా నడిపించసాగాడు శ్రీను. అతని చేతిని వదిలి “ఆనాడు నిన్ను ప్రయోజకుడ్ని చేయడం కోసం ఇలాగే రిక్షాలో నా చేతిని ఆసరా చేసి నిన్ను మెడికల్ కాలేజీలో చేర్పించాను. నువ్వు ప్రయోజకుడివి అయిన తర్వాత నన్ను అప్రయోజకుడ్ని చేశావు” అన్నారు మాష్టారు.

ఫార్మాలిటీస్ ముగించిన శ్రీను తండ్రికి వీడ్కోలు చెప్పి వచ్చేశాడు. ఈరోజు నుండి తను, తన భార్య, తన కొడుకు హాయిగా ఉండొచ్చు అనుకున్నాడు మనసులో.

గతం అతడ్ని వెక్కిరించింది. చేసింది తప్పని తెలుస్తుంది. తనకొచ్చిన పీడకలకు అర్థం...!? అతనికి తెలీలా! ఇంక ఆ రాత్రి శ్రీను నిద్రపోలేదు.

◆◆◆

ఇవన్నీ ‘రావు’ అనే మరో మిత్రుడు రాసిన ఉత్తరం ద్వారా మాష్టారికి తెలిశాయి. మాష్టారు వృద్ధాశ్రమం వదిలి వచ్చేశారు. ఎక్కడకు వెళ్లారు....!? అనేది రామచంద్రకు, రావుకు మాత్రమే తెలుసు. మరెవరూ తెలుసుకోలేరు. రావుకు ఎవరితో చెప్పొద్దన్నారు మాష్టారు. రామచంద్ర చెప్పడు. చెప్పలేడు. ఎందుకంటే...?

తరంగ్ వృద్ధాశ్రమం ముందు కారాగింది. అందులో నుండి ఓ యువకుడు దిగాడు. అతని పేరు శ్రీను. ఆశ్రమం ముందు జనం గుంపులు గుంపులుగా నిలబడి ఉన్నారు. కొందరు సిమెంటు బెంచీలపైన కూర్చుని విషాద వదనాలతో చర్చించుకుంటున్నారు.

శ్రీను ఒక ముసలాయన వద్దకు వెళ్లి తన తండ్రిని గురించి అడిగాడు. ఆ ముసలాయన కోపంగా చూసి ఒక ఉత్తరం చేతిలో పెట్టి వడివడిగా వెళ్లిపోయాడు.

శ్రీను ఉత్తరం చదువుకుంటున్నాడు.

“వర్తమానంలో పిల్లలకు తల్లిదండ్రులకు మధ్య కనపడని చీకటి ఆవరించి ఉందని నేను ఆలస్యంగా గ్రహించాను. ఈ చీకటి ఎందుకు ఏర్పడింది అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. ఇందుకు కారణం నాకు తెలిసింది నీకు చెబుతాను. తల్లిదండ్రులు చిన్నతనంలో తాము చేయలేని పనులను పిల్లల చేత చేయిస్తున్నారు. ఈనాటి బిడ్డలు పుట్టుకతోనే తెలివిగల వారు. నా మొత్తం జీవితం దుఃఖమయం. తమ జీవితాలను సుఖమయం చేసుకోలేని వారు ఇతరుల జీవితాలను ఎలా సుఖమయం చేస్తారు? ఎలా పిల్లల జీవితాలను చక్కదిద్దుతారు? ఇది ఎలా సాధ్యం? నన్ను నేను సరిదిద్దుకోదలచుకున్నాను. పిల్లల నుండి తల్లిదండ్రులు తమ చివరి దశలో ఓ తోడూ నీడా ఆశిస్తారు. ఆశించింది దక్కకపోతే ఆవేదన కలుగుతుంది. ప్రతి తల్లిదండ్రులకీ వర్తమానంలో ఈ ఆవేదనే మిగులుతుంది. నీ మీద నాకు కోపం లేదు. అమ్మ పోవడం కూడా నేను ఆలోచించుకునేందుకు అవకాశం కలిగించింది. నువ్వు, అమ్మాయి, మనవడు సుఖంగా ఉండాలని కోరుతున్నాను. నీకు నా గురించిన వివరాలు రామచంద్ర... అదే నామిత్రుడు చెప్పవచ్చు. చెప్పలేకపోయినా ఆయన్ను నిందించకు. ఇంతకుమించి డాక్టరువైన నీకు ఏం చెప్పగలను?

ఇట్లు

నీ తండ్రి.

ఉత్తరం పూర్తి చేసేసరికి శ్రీను కళ్ల నిండా నీళ్లు. తన తండ్రికి తాను చేసిన ద్రోహం తెలిసింది. ఉత్తరం జేబులో పెట్టుకుని మరో ముసలాయన్ని అడిగాడు “ఇక్కడ రామచంద్ర అనే అతను...” అతని మాట పూర్తికాకుండానే ఆ ముసలాయన...

“రామచంద్ర రాత్రే హార్టెటాక్ వచ్చి చనిపోయి అదృష్టవంతుల జాబితాలో చేరిపోయాడు. కానీ ఒక్కమాట. నువ్వు నా బిడ్డలాంటివాడివని చెబుతున్నాను. అయినవారందరూ ఉండి ఇలా అనాథలా బతకడంలోని నరకయాతన మేం అనుభవిస్తున్నాం. దయచేసి నీవంటివారు ఇటువంటి ఆశ్రమాల్లో చేరే పరిస్థితులను కల్పించుకోకండి. ప్లీజ్.. ప్లీజ్...” కన్నీళ్లను తుడుచుకుంటూ వెళ్లిపోయాడు.

మాష్టారి గురించి ఆయన కుమారుడు శ్రీనుకు ఎవరు చెబుతారు? కాలమే చాలా ప్రశ్నలకు సమాధానం చెబుతుంది. బహుశా.. ఆయన ప్రశ్నకు కూడా చెప్పవచ్చు.

★

మీరూ... మీ నిద్ర...

నిద్ర ఒక అలవాటు అని కొందరి భావన. పరిస్థితులు అనుకూలంగా ఉంటే ఎవరైనా నిద్రపోతారు. బద్ధకస్తులు, సోమరులు ఎక్కువసేపు నిద్రపోతారు. ఎందుకంటే వారికి చేయాల్సిన పనుల గురించి ఎటువంటి ఆందోళనా ఉండదు. నిద్ర అనేది మన జీవన విధానంలో ఉండే పాక్షిక స్పృహగల స్థితి. నిద్రసమయంలో శరీరంలోని జీవన విధానాలన్నీ జరుగుతుంటాయి. పరిసరాలలో జరిగే పనులకు ఎటువంటి స్పందన లేకుండా తాత్కాలికంగా ఆదమరచి ఉంటాం. నిద్ర సమయంలో శారీరక సంబంధమైన అనేక మార్పులు జరుగుతాయి.

- సి.వి. సర్వేశ్వరశర్మ
ఫోన్ నెం: 9866843982
sarma.chavali@gmail.com

పనిచేయడం వల్ల మనం కోల్పోయిన శక్తి నిద్రలో తిరిగి పొందగల్గుతాం. గాఢనిద్రలోనే శరీరంలోని మరమ్మతులన్నీ జరుగుతాయి. వ్యర్థ పదార్థాలు, మాలిన్యాలు అన్నీ తొలగించబడతాయి. గాయాలపై చర్మం ఏర్పడుతుంది. చీము బుడగలు చితుకుతాయి. మరుసటి రోజుకు శరీరాన్ని తయారు చేస్తుంది మెదడు.

నిద్రపై ఎంత పరిశోధన జరుగుతున్నప్పటికి నిద్రకు కారణం స్పష్టంగా తెలియడం లేదు. నిద్రను అదుపు చేసే యంత్రాంగ స్వభావం జీవ రసాయనికం కావచ్చు అంటున్నారు. మెదడు భిన్న ప్రాంతాల్లో ఉండే రసాయనాలు, విద్యుత్ స్పందనలను బదిలీ చేయడంలో సహాయపడతాయని ఇవే నిద్రా విధానంలో కీలక పాత్ర వహిస్తాయిని నమ్ముతున్నారు. సైనికులు, డ్రైవర్లు, పోలీసులు, ఫ్యాక్టరీలో పనిచేసే వారు ఎక్కువ సమయం మెలకువగా ఉండాల్సి వస్తుంది. మగవారి కన్నా స్త్రీలు ఎక్కువ సమయం నిద్రలేకుండా ఉండగలరు. ఎందుకంటే వారి శరీర కణాల్లో ఉండే కొవ్వులోని అధిక శక్తి ఆదుకుంటుంది. ఉదయాన్నే నిద్రలేవగానే మగవారిలో ఉత్సాహం అధికంగా ఉంటుంది. ఆడవారిలో అంత ఉత్సాహం ఉండదు. ఆడవారికి ఉత్సాహం ఉండకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయంటున్నారు పరిశోధకులు. పురుషులకన్నా స్త్రీలు కనీసం అయిదు శాతం తక్కువ నిద్రిస్తారు.

పని - నిద్ర

ఎక్కువ ధనార్జన ఉంటే మగవారు నిద్ర మానుకుని పనిచేయగల్గుతారు. స్త్రీల విషయంలో ఇందుకు భిన్నంగా ఉంటుంది. స్వతహాగా వారికి నిద్ర తక్కువ. అందువల్ల మరికొంత ఆర్జన కోసం వారు నిద్రను వదులుకోవడానికి ఇష్టపడరు. యవ్వన దశలో స్త్రీలు కొంత ఎక్కువ సమయం మెలకువగా ఉండగల్గినప్పటికీ వయసు పైబడుతున్న కొలదీ నిద్రను ఆపుకోలేరు.

ఇరవై - ముప్పై సంవత్సరాల నడుమ వయసుగలవారు నిద్రను త్యాగం చేసి పనిలో నిమగ్నం కాగలరు. కాకపోతే పని సవాలుగా, సృజనాత్మకంగా ఉండాలి. చేసేపని విసుగ్గా ఉంటే త్వరగా అలసిపోయి విశ్రాంతి కోసం ఎదురు చూస్తారు.

డబ్బు వస్తుందని ఎంత ఆశ వున్నా బోరనిపించే పనులను మెలకువతో ఉండి చేయగల్గడం దాదాపు అసాధ్యమనే చెప్పుకోవాలి. నిద్ర లేకుండా ఒక వ్యక్తి గడిపిన సమయం 11రోజులు. అలసట అనేది మెదడులో ఒక రసాయనం పేరుకు పోవడం వల్ల వస్తుందని ఆ రసాయనం నిద్రను ప్రేరేపిస్తుందని నమ్ముతున్నారు.

ఇన్‌సోమ్నియా

నిద్ర రాకపోతే మనిషికి ఎంతో ఆందోళనగా ఉంటుంది. నిజానికి ఆందోళనలు నిద్ర పట్టకపోవడానికి ప్రధాన కారణాలు. నిద్ర రాకపోవడం లేదా నిద్ర తక్కువగా ఉండే అలవాటును 'ఇన్‌సోమ్నియా' అంటారు. సాధారణంగా ఉండే నిద్రచక్రంలో ఏ విధమైన కలత కలిగినా ఇన్‌సోమ్నియాను కలగజేస్తుంది. 'ఇన్‌సోమ్నియా' అనేది వ్యాధి అనడం కన్నా అదొక లక్షణం అనడం మంచిది. మెదడు, శరీరంలోని దోషాలను ఇది సూచిస్తుంది. రకరకాల ఇన్‌సోమ్నియా, ఇంకా దానితో పాటు కనిపించే ఇతర లక్షణాలు అంతర్గతంగా ఉన్న అనారోగ్యాన్ని తెలియజెబుతాయి. మెదడులోని నిద్రాకేంద్రంలో, హార్మోన్ల పరంగా లేదా ఎండోక్రైన్‌లలో క్రమరాహిత్యం కారణంగా ఈ కలత కలగవచ్చు. శారీరకమైన లేదా మానసికమైన కారణాలు కూడా ఈ స్థితిని కలిగిస్తాయి. శారీరక కారణాల వల్ల ఉదయపు ఇన్‌సోమ్నియా కలుగుతుంది. ఇటువంటి సందర్భాల్లో వ్యక్తికి తెల్లవారు జామున మెలకువ రావడం ఆపై నిద్రపట్టక పోవడం సంభవిస్తుంది. కొంతమందికి మానసిక వికారాలు ఉండొచ్చు. మందులు, మద్యపాన సేవనం... ముక్కు ద్వారా గాలి పీల్చడం కష్టమౌతూ ఉండడం, భారీ శరీరం కల్గి ఉండడం, కండరాల వ్యాధులు నిద్రలేమికి కారణాలు అవుతాయి. అలవాటు పరంగా వచ్చే ఇన్‌సోమ్నియా మరొకరకానికి చెందినది. ఒక ప్రత్యేక కారణం వల్ల వ్యక్తి ఈ రకం ఇన్‌సోమ్నియాను పొందుతాడు. ఆ తర్వాత అది అలవాటయి కూర్చుంటుంది. మరొక రకం పేరు మిద్యా ఇన్‌సోమ్నియా. ఈ తరహావ్యక్తి నిద్రపోయినా అవిశ్రాంతంగా... నిద్రలేమిగా అనిపిస్తుంది. నిజ జీవితంలోని ఆందోళనలు, ఒత్తిడులు సుషుప్తస్థితిలో మెదడులో చురుగ్గా ఉండి అలజడి కలిగిస్తాయి. విమాన ప్రయాణాలు, ముఖ్యంగా అంతర్జాతీయంగా విమానాల్లో ప్రయాణం చేసేవారికి ఇన్‌సోమ్నియా వస్తూవుంటుంది. ఇది తాత్కాలికంగానే ఉంటుంది.

సుఖనిద్రకు మార్గాలు

- నిద్ర నుండి మెలకువ వస్తే మళ్లీ నిద్ర రాకపోతే మరొక గదిలోకి వెళ్లి ఏదో ఒక పుస్తకం చదవడం మొదలు పెడితే మళ్లీ నిద్ర వస్తుంది.
- క్రమం తప్పకుండా వ్యాయామాలు చేస్తూ ఉంటే మంచినిద్ర వస్తుంది. అయితే వ్యాయామం నిద్రపోయేముందు మాత్రం చేయకూడదు.
- మీ బెడ్‌రూంలో చల్లని వాతావరణం ఉండాలి. కప్పుకునేందుకు మరొక దుప్పటి తయారుగా ఉంచుకోవాలి.
- నిద్రకు అరగంట ముందు గోరు వెచ్చటి నీటితో స్నానం మంచిది.
- నిద్రకు ఉపక్రమించే ముందు వేడి పాలు తాగితే మేలు కల్గుతుంది.
- నిద్రించేముందు సంగీతం, పాటలు వంటివి వినే అలవాటు ఉంటే వాటిని కొనసాగించాలి.
- మరసటి రోజు ధరించాల్సిన దుస్తులను ఎంపిక చేసుకోవడం, తలుపులు తాళాలు వేసుకోవడం వంటివి ముగించిన తర్వాత నిద్రకు ఉపక్రమించాలి.
- నిద్ర పోయేముందు ఆల్కహాల్ వంటివి సేవించకూడదు. కాఫీ, టీల వంటివి తాగకూడదు. కెఫీన్‌కు మీరు బాగా స్పందించడం జరుగుతుంటే పూర్తిగా కాఫీని నిషేధించండి.
- నిద్రకు ముందు అతిగా తినకూడదు. తేలిగ్గా భోజనం ముగించుకోవాలి.
- మీ బెడ్‌రూంలో టీవీ లేదా పనిచేసుకునే టేబుల్, కుర్చీవంటివి ఉంచకూడదు. బెడ్‌రూం కేవలం నిద్రకు, దాంపత్య జీవితానికే పరిమితం అయ్యేట్లు ఉండాలి.
- దేని గురించి ఆందోళన చెందకూడదు. మర్నాడు ఫ్రెష్‌గా ఏ పనినైనా చేయవచ్చునని మనసుకు సమాధానం చెప్పుకుని నిద్రకు ఉపక్రమించాలి.
- ఇన్‌సోమ్నియాను జయించాలంటే నిద్రమాత్రలకు అలవాటుపడకూడదు.
- ఇన్‌సోమ్నియా నుండి వెంటనే బయటపడలేరు. కొంత టైం పడుతుంది. ఓర్పు, సహనం కావాలి.
- ఒక్కసారి నిద్రలేమి నుండి బయటపడ్డారంటే ఇక ఆ సమస్య మిమ్మల్ని వెంటాడదు.

★



చీమల చట్నీ

వేడి వేడి అన్నంలో ఆవకాయ పచ్చడి, నెయ్యి వేసుకు తింటే వుంటుందీ...అబ్బ ఆ రుచే వేరు. ఇంక గోంగూర, నెయ్యి వేసుకు తింటే... మాటల్లో వర్ణించలేం. ఇవి రెండూ మనకు తెల్సినవే. మరి ఎర్రచీమల చట్నీ కలుపుకు తింటే... ఎలా వుంటుంది? మొహం అలా పెట్టారేంటి? సరే... మీకు చీమల చట్నీ పెద్దగా నచ్చినట్టులేదు. కానీ బస్తర్ ప్రాంతంలోని (ఛత్తీస్‌ఘడ్) ఆదివాసులకు మాత్రం అదే ఆవకాయ, గోంగూర. వారికదే అత్యంత ప్రీతిపాత్రమైనది. వీరికి ఎర్రచీమల పచ్చడి అంటే ఎంతో ఇష్టం. వ్రంజనం ఎర్రచీమలతో చేసే ఆ వంటకాన్ని 'చాపడా చట్నీ' అంటారు. చాపడా అంటే వారి భాషలో ఎర్రచీమలు అని అర్థం. తెలుగులో వాటిని పుటి చీమలు అంటారు. రుచిలోనే కాక పోషక పదార్థాల్లోనూ సాటిలేనిదని వారి విశ్వాసం. ఇవి గుగ్గిలం, మామిడి, అరటి, నేరేడు, విప్పపువ్వు వంటి చెట్ల చిటారు కొమ్మల మీద గూళ్లు కట్టుకుని నివసిస్తుంటాయి. వీటిని పట్టుకోవడమంటే సాహసమే. సూర్యోదాయానికి ముందుగానీ,' సూర్యాస్తమయానికి తర్వాతగానీ వీటిని పట్టుకోడానికి వెళతారు. అప్పుడైతే వాటి దాడి తక్కువగా వుంటుంది. ఒకవేళ దాడి చేసినా గాయాలు పెద్దగా కాకుండా వుండడానికి ముందే వంటికి బూడిద పూసుకుని వెళతారు. చెట్టుపైకి ఎక్కినవారు చీమలగూళ్లున్న కొమ్మను నరికి కింద నిలబడి వున్నవారికి అందిస్తారు. అందుకున్నవారు గూళ్లను విడదీసి చీమల్ని గుడ్లను ఒక వెదురుబుట్టలోకి రాలుస్తారు. ఆ బుట్టకు ఓ బట్ట చుట్టి గట్టిగా కుదుపుతారు. నేలకేసి బాదుతారు. దాంతో చీమలు చనిపోతాయి. ఈ చాపడా చీమలు గోధుమ, కాషాయ రంగులో వుంటాయి. వర్షాకాలంలో ఇవి ఎక్కువగా దొరుకుతాయి. చాపడా చీమల మిశ్రమంలో ఉప్పు, మిరపకాయలు, టమాటాలు కలిపితే చీమల చట్నీ రెడీ. ఇది కొంచెం పుల్లగా, రుచిగా వుంటుందంటారు. దట్టమైన అడవుల్లో నివసించేవారైతే ఏమీ కలపకుండా పూర్తిగా చీమలతోనే చట్నీ తయారుచేస్తారు. బస్తర్‌లో అధికశాతం ఆదివాసీలు చీమలచట్నీని తింటారు. చెట్లెక్కి చీమల్ని పట్టి చట్నీ తయారుచేసుకోలేనివారు సంతల్లో కొనుక్కుంటారు. చిన్న చిన్న ఆకు దోనెల్లో చట్నీ కూడా అమ్ముతారు. అదన్నమాట సంగతి.



తెలుసా!

కుర్చీ చెట్టు

మనం ఇప్పటి వరకు చెట్లు నరికి కుర్చీలు తయారు చేయడం గురించి విని వుంటాం. చూసి వుంటాం. కానీ చెట్లనే కుర్చీలాగా మలచడం గురించి విన్నారా? ఇలా చేయడాన్నే 'పూక్ ట్రీ' అంటారు. అంటే చెట్టును ఒక ఆకారంలోకి మార్చడం అన్నమాట. మనకు కావాల్సిన ఆకృతిలోకి చెట్టును మలచడమే ఈ ఆర్ట్ గొప్పతనం. కుర్చీలా, మనిషిలా, నిచ్చెనలా, పడవలా... ఏ ఆకారంలోకి కావాలంటే ఆ ఆకారంలోకి మార్చుకోవచ్చు. దీన్ని 1903లో జాన్ అనే వృక్ష ప్రేమికుడు ఒక మొక్కను నాటి దానిని 11 సంవత్సరాలు కష్టపడి కుర్చీ ఆకారంలోకి తీసుకొచ్చాడు. ఆ తర్వాత అనేక మంది అనేక రకాలుగా ఆకారాలు తయారు చేసేశారనుకోండి. సింపుల్‌గా చెప్పుకోవాలంటే... జీవమున్న మొక్కల్నే మనకు కావాల్సిన ఆకృతిలోకి మార్చుకుని వాడుకుంటామన్నమాట.



గాడిదల అభయారణ్యం

మనుషులకోసం పాపం పొద్దస్తమానం చాకిరీ చేస్తాయి గాడిదలు. అందుకే ఎక్కువ శ్రమను గాడిదచాకిరీతో పోలుస్తుంటారు. ఈ గాడిదల కోసం ఈజిప్టు, బ్రిటన్, కెన్యా, మెక్సికోల్లో అభయారణ్యాలున్నాయంటే నమ్ముతారా! సరే...అక్కడ దాకా ఎందుకు? మనదేశంలో కూడా ఒక్కటంటే ఒక్క గాడిదల అభయారణ్యం వుంది. అదీ నాందేడ్‌లో. దాని పేరు ధర్మ డాంకీస్ సాంక్చ్యురీ. పదేళ్ల కిందట ఓ స్వచ్ఛంద సంస్థ దీన్ని ప్రారంభించింది. ఇక్కడ గాడిదలకు క్లినిక్, ఆసుపత్రి, సంరక్షణ కేంద్రం, వృద్ధాశ్రమం వున్నాయి. ఇవన్నీ కలిపితేనే అభయారణ్యం. చుట్టుపక్కల యాభై గ్రామాల నుంచి గాడిదలను తీసుకొచ్చి వైద్యం చేయిస్తుంటారు. గాయపడిన, అనారోగ్యంతో బాధపడుతున్న గాడిదలను ఇక్కడకి తీసుకొచ్చి అప్పచెప్తే చాలు. వైద్యం, ఫుడ్డు అన్నీ వారే చూసుకుంటారు. ముఖ్యంగా ముసలివాటిని ప్రత్యేకంగా చూస్తారు. సంవత్సరానికోసారి వ్యాక్సినేషన్ ఇవ్వడం, డివర్మింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహించడం చేస్తుంటారు. ఇక్కడికి వచ్చే కేసుల్లో గాయపడినవే ఎక్కువగా వుంటాయి. గాయాలు మానవనుకున్న వాటిని యజమానులు అక్కడే వదిలేస్తుంటారు. అక్కడ గడ్డికి కొదవ వుండదు. నీటి కొరత కూడా లేదు. మూడు గొట్టపు బావులున్నాయి. మహారాష్ట్రలో గాడిదలమీద బతికే కుటుంబాలు ఎక్కువగానే వున్నాయి. ఇటుక పనిచేసే కుటుంబాలు నమ్ముకునేది గాడిదలనే. వారు తరచూ వలస పోతుంటారు.అటువంటప్పుడు సామాను మోసేది గాడిదలే. ఈ క్రమంలో గాయపడిన గాడిదలు కూడా అభయారణ్యం చేరుకుంటుంటాయి.



చుక్కల గువ్వ

పిల్లలూ...! ఇవాళ్ల చుక్కల గువ్వ గురించి తెలుసుకుందామా! ఇవి మైనా కంటే పెద్దవి. పావురం కంటే చిన్నవి. వీటిలో కొన్ని ఎరుపు, గోధుమ రంగు కలిసినట్లుగా ఉంటే, మరికొన్ని బూడిద రంగు, ఎరుపు కలిసినట్లు ఉంటాయి. పేరుకు తగ్గట్టే శరీరంపై తెల్లని చుక్కలు కనిపిస్తాయి. మెడ నల్లగా ఉంటుంది. అన్ని పక్షుల్లాగే ఇవీ గుంపుగానే వుంటాయి. వీటి ఆహారం పొలాల్లో రాలిపోయిన గింజలు. మీరు గమనించే వుంటారు. పక్షులు ఇళ్ల దగ్గరికి రాగానే కొంతమంది వాటిని తరుముతుంటారు. అలా చేయక పోతే ఇవి నేరుగా ఇంట్లోకి వచ్చేసి మనతో పాటే తిరుగుతూ సందడి చేస్తుంటాయి. ఇంటి చూరులోనో, చెట్లమీదో గూడు కట్టుకుంటాయి. ఇవి సన్నటి పుల్లలతో, గడ్డితో గూటిని తయారు చేసుకుంటాయి. అందుకే ఆ గూడు చాలా బలహీనంగా ఉంటుంది. ఇవి అన్ని పక్షుల్లా ఒకేసారి అరవవు. ఆగి ఆగి కూత వేస్తాయి. అన్నట్టు ఇవి రెండు గుడ్లను పెడతాయి. అవి తెల్లగా ఉంటాయి.



నేర్చుకుందాం



ఎక్కడ దాక్కున్నాయ్!?

హేయ్.. నాలుగు కుందేళ్లు ఎంచక్కా డాన్స్ చేసుకుంటూ వస్తున్నాయి. ఉన్నట్టుండి రెండు కుందేళ్లు మాయమైపోయాయి. అయితే అవి అక్కడే దాక్కున్నాయి. ఎక్కడున్నాయో కనిపెట్టి చెప్పండే

తులసి, 9వ తరగతి, లార్డ్ వెంకటేశ్వర హైస్కూల్, కర్నూల్.



చుక్కలు కలిపేస్తే పోలా!



ఎక్కడున్నాయో...

ఫ్రెండ్స్... ముగ్గురు స్నేహితులు మీతో సరదాగా ఆడుకోడానికి వచ్చారు. ఇందులో కొన్ని వస్తువులు, ప్రాణులు, తినే పదార్థాలు దాగున్నాయి. అవేంటో కింద ఇచ్చాం. వాటిని బట్టి అవి ఇందులో ఎక్కడున్నాయో వెతికి సున్నా చుట్టండే.

పట్టుకోండి

చిన్నారులూ...ఇక్కడ కొన్ని ఆంగ్ల అక్షరాలు కనిపిస్తున్నాయి చూశారుగా. వాటి పక్కనే కొన్ని పదాలు కూడా ఇచ్చాము. ఆ పదాలు ఈ అక్షర సమూహంలో నిలువుగా, అడ్డంగా ఎలాగైనా వుండొచ్చు. వాటిని వెతికి పట్టుకోండి.

z	i	o	h	e	t	t	y	q	l	d	j	i	t
p	v	s	x	f	e	l	e	o	n	i	e	b	c
p	i	b	a	r	d	h	l	i	s	e	t	t	e
w	l	g	r	b	k	h	i	n	e	k	e	z	y
h	s	c	s	e	e	a	w	e	n	b	h	d	i
k	e	m	m	t	n	l	r	l	c	r	e	f	i
w	k	w	p	a	e	d	l	i	w	a	t	f	m
c	h	r	i	s	r	l	a	a	n	m	u	i	i
e	s	e	h	l	v	i	l	m	i	p	d	n	c
l	u	j	p	a	b	b	a	a	a	h	p	q	y
l	s	s	r	a	d	e	u	n	z	a	n	u	u
y	a	u	d	d	u	d	r	u	n	m	i	c	s
s	n	d	j	m	c	l	a	t	d	e	s	k	j
c	r	x	p	x	i	p	a	q	j	g	s	u	e

bram
brenda
chris
elly
hadda
hetty
ilse
ineke
isabella
karin
leonie
lisette
maaike
marianne
nel
paula
stella
susan
wilbert

త్రిభుజాలెన్ని?

నేస్తాలూ... పక్కన ఓ పేద్ద త్రిభుజం ఉంది చూశారా. దాన్లో చాలా త్రిభుజాలు దాగున్నాయి. మీరు ఏం చేయాలంటే అందులో మొత్తం ఎన్ని త్రిభుజాలున్నాయో చెప్పాలి.



మాటల కోట - 47

రూపకల్పన : కర్లపాలెం

■	1	2	3	■	4	5		■
6	■	7					■	8
9	10	■		■		■	11	
12			■	13	■	14		■
	■	■	15			■	■	16
■	17		■		■	18	19	
20		■	21	■	22	■	23	
	■	24				25	■	
■	26			■	27			■

నిలువు :

2. నావి కావు... (2)
3. తడబడిన సరాసరి (3)
4. రాక్షసి (3)
5. చేపలను పట్టే సాధనం (2)
6. స్కామ్ (4)
8. చెట్టుకి ఆధారం (2)
10. వెకిలి (2)
11. వాసన (2)
13. వాదన కాదు. విస్సన్న చెప్పినది (3)
16. శంకర్ సినిమా 'జై బోలో...' (4)
17. చంద్రుడు (2)
19. రోజు (2)
20. బైరాగి లో లోహం (2)
21. తడబడిన జననం (3)
22. కింది నుండి భూమి. ఓ తెలుగు మ్యాగజైన్ పేరు కూడా (3)
24. జన్మనిచ్చే దేవత (2)
25. దండ కింద నుండి (2)

అడ్డం :

1. 'మనసంతా నువ్వే' చిత్రంలో ఈ ప్రాణిమీద ఏకంగా ఒక పాటే ఉందిమరి (3)
4. రాగములు వాడుక భాషలో (3)
7. ఇది ఏ కాలం (5)
9. భళా... భళా! - బావుంది (2)
11. జల'తారు'లో నల్లనిది (2)
12. సరోజినీ నాయుడు భారత... (3)
14. దీన్ని ముద్దుగా ఇడియట్ బాక్స్ అంటాం (2)
15. నాలుగు భుజములు సమానంగా ఉండే చతురస్రం (3)
17. జూనియర్ ఎన్టీఆర్ కొత్త సినిమా (2)
18. పదితో మొదలు పెట్టండి! భద్రం (3)
20. మేషాది రాశుల పోగు (2)
23. గానం తిరగబడింది (2)
24. అంతం లేని పురం (5)
26. మాధుర్యం (2)
27. విహరించేవాడు (3)

మాటలకోట - 46 జవాబు

■	1 భా	2 ర	3 త	■	4 కా	5 పా	డు	■
6 జ	■	7 వి	దే	8 శీ	య	ము	■	9 తె
10 పా	11 దం	■	12 వ	ర్ష	ము	■	13 దం	నా
14 ను	డు	15 వు	■	ము	■	16 క	డ	లి
■	■	17 రు	చి	■	18 బా	వి	■	■
19 తె	20 ను	గు	■	21 అ	■	22 త	23 న	24 ది
25 దే	వి	■	26 క	డ	27 వ	■	28 క్కు	వా
పా	■	29 వ	ర	వి	క్ర	30 యం	■	ను
■	31 వా	ల	ము	■	32 ము	న	గ	■

గుణపాఠం

అడవిలో ఒక సింహం ఉంది. అక్కడుండే ఇతర జంతువులన్నింటికీ తనే రాజుగా చెప్పుకునేది. పైగా తన మాటే అందరూ వినాలని, తన ఆజ్ఞను ధిక్కరించిన వారిని చంపి తినేస్తానని హెచ్చరించింది. దాంతో భయపడిపోయిన జంతువులన్నీ సింహాన్నే రాజుగా ప్రకటించాయి. ఆ అడవిలోనే ఒక జిత్తుల మారి నక్క ఉంది. అది ఎలాగోలా చిన్న జంతువులను చంపి తినాలని ఆరాటపడేది. దాని జిత్తులు తెలిసిన ఏ జంతువూ దాన్ని దగ్గరకు రానీయకుండా, దూరంగా ఉంటూ జాగ్రత్తపడేవి. తన ఎత్తులు పారడం లేదని తెలుసుకున్న నక్క తిన్నగా సింహం గుహ దగ్గరకు వెళ్లింది. సింహం నక్కని చూసి "ఏంటి ఇలా వచ్చావు?" అంది.

"మీకు సేవలు చేసుకుందామని వచ్చాను రాజా!" అంది వినయంగా.

"నువ్వు నాకెలా సేవలు చేయగలవు? అసలే జిత్తులమారివి. తోక జాడించావంటే చంపి తినేస్తాను" అంది.

"అయ్యో! ఆ విషయం నాకు తెలియదా రాజా! నేను మీ పక్కనే ఉంటూ మీరు అడిగినప్పుడు సలహాలిస్తూ మీకు మంచి చేయాలనే వచ్చాను" అంది.

"సరే! బుద్ధి మంచిదయితే పర్వాలేదు. అదుపు తప్పితే చంపేస్తాను జాగ్రత్త" అంది.

ఆ రోజు నుండి నక్క సింహం రాజుకి నమ్మినబంటుగా ఉంది. సింహం గుహలో ఒక మార్జాలం కూడా ఉంది. అది కూడా సింహం దగ్గర నమ్మకంగా ఉండేది. సింహం స్వతహాగా చాలా మంచిది. అడవిలోని జంతువులని ఏం చేసేది కాదు. అందుకే అక్కడి జంతువులన్నీ హాయిగా, స్వేచ్ఛగా తిరుగుతుండేవి. జంతువులన్నీ అలా స్వేచ్ఛగా తిరగడం నక్కకి అసూయగా ఉంది. వాటిని ఎలాగైనా తినాలన్న కోరిక రోజురోజుకి పెరిగిపోయింది. దాంతో ఒక దుష్ట పథకం వేసింది. సింహంరాజు విశ్రాంతిగా ఉన్న సమయంలో వినయంగా "రాజా! మీకో సలహా చెపుతాను. వింటారా?" అంది.

"ఏమిటా సలహా? మా మేలు కోరేదయితే తప్పక విని ఆచరిస్తాను" అంది.

"చాలా చక్కని ఆలోచన రాజా! దీని వల్ల మీరు ప్రతిరోజూ ఆహారం కోసం వెతుక్కోనవసరం లేదు. పైగా ఆహారమే మీ దగ్గరికి వస్తుంది" అంది.

"అలాగా! అయితే ఆ సలహా ఏంటో త్వరగా చెప్ప" అంది.

"మన గుహలో మార్జాలం ఉందిగా రాజా"

"అవును. పాపం ఎప్పట్నుండో చాలా నమ్మకంగా ఇక్కడే ఉంటోంది.

"ఆ మార్జాలం తోనే మనం ఒక ఆటాడదాం"

'ఆటా! ఏమిటది?"

"మార్జాలం వీపున ఒక దీపం పెడదాం. ఆ దీపాన్ని ఎవరు పడగొడితే వారికి కోరిన బహుమతి ఇస్తామని, లేకపోతే ఆ జంతువును చంపేస్తామని ప్రకటన చేద్దాం. అప్పుడు మీరు ఆ చనిపోయిన జంతువుని ఆహారంగా స్వీకరించొచ్చు" అంది.

"అదెలా? దీపం పడగొడితే ఓడిపోతాం కదా?" అంది సింహం.

"అలా ఎప్పటికీ జరగదు. ఎందుకంటే ఆ మార్జాలం మనం చెప్పినట్లు వింటుంది కదా! కదలకుండా ఉన్నా, తిరిగినా దీపం పడదు. ఎగిరితేనో, గెంతితేనో తప్ప" అంది.

"అయితే నాకు రోజుకో జంతువు ఆహారంగా దొరుకుతుందన్నమాట. వెంటనే చాటింపు వేయించు" అంది సింహం.

"చిత్తం. ఇప్పుడే వేయిస్తాను!" అంది నక్క

నక్క అడవి జంతువులన్నింటికీ 'ఆట' గురించి సింహం మాటగా చెప్పింది.

అప్పటి నుండి ఏదో ఒక జంతువు ఆటలో ఓడిపోవడం, సింహానికి ఆహారమవడం నిత్యకృత్యమైంది. సింహం తినగా మిగిలిన మాంసాన్ని నక్క తింటూ చాలా సంతోషంగా ఉంది.

అడవిలోని జంతువులు తగ్గిపోతున్నాయి. మిగిలిన జంతువులు 'ఇలా అయితే కొంత కాలానికి అడవిలో ఇక జంతువులే కనవడవు' అని భయపడుతున్నాయి.

ఓ రోజు ఆ అడవిలో ఉండే కుందేలు ఇంటికి మరో అడవిలోని కుందేలు వచ్చి "ఏంటి మావా ఇక్కడి విశేషాలు" అంది.

" ఏం చెప్పమంటావు అల్లుడూ..." అంటూ సింహం రాజు అవడం దగ్గర్నుండి రోజుకో జంతువు దానికి ఆహారమవడం వరకు మొత్తం వివరంగా చెప్పింది.

"అలాగా! ఇదంతా నాకు ఆ జిత్తులమారి నక్క పథకం అనిపిస్తోంది. ఎలాగైనా దానికి గుణపాఠం చెప్పాలి. ఈ రోజు ఆ దీపం పడగొట్టడానికి నేను వెళ్తాను" అంది కొత్తగా వచ్చిన కుందేలు.

"నువ్వా? నీకేమయినా అయితే మీ వాళ్లకి నేనేమని సమాధానం చెప్పాలి?" భయంగా అంది ఆ అడవిలోని కుందేలు.

"ఏం భయపడకు. జరిగేది చూడు!" అంది.

సాయంకాలమైంది. అడవిలో చీకట్లు ముసురుకుంటున్నాయి. సింహం సభ పెట్టింది. జంతువులన్నీ వచ్చాయి. కొత్తగా వచ్చిన కుందేలు పోటీలో పాల్గొంటానని సింహంతో చెప్పింది. కుందేలు మాంసం తినబోతున్నందుకు నక్క చాలా సంతోషించింది.

సింహం అంగీకారంతో కుందేలు నిదానంగా పిల్లి వైపు వెళ్లింది. అన్ని జంతువులూ ఆసక్తిగా చూస్తున్నాయి. కొద్దిసేపటి తర్వాత పిల్లి ముందుకు ఎగిరి దూకింది. అంతే దీపం కింద పడిపోయింది. జంతువులన్నీ ఆనందంతో చప్పట్లు కొట్టాయి.

సింహానికి కూడా దీపం ఎలా కిందపడిందోనని ఆశ్చర్యమేసింది.

దీపం పడగొట్టిన కుందేలు సింహం ముందుకొచ్చి "రాజా! మీరు చాలా మంచివారు. అడవిలో జంతువుల్ని చంపి తినాలనే దుర్బుద్ధితో ఆ జిత్తులమారి నక్క ఈ పథకం వేసింది. ఇలా జంతువులన్నీ చనిపోతే జాతి నాశనమైపోతుంది" అంది.

"నిజమే! ఈ నక్క మాటలు విని అమానుషంగా ప్రవర్తించాను. నాకు గుణపాఠం నేర్పావు. ఈ నక్కని నేను శిక్షిస్తాను. మీరంతా సంతోషంగా ఉండండి" అంది.

ఆ కుందేలు చేసిన పనికి జంతువులన్నీ అభినందించాయి. ఇక్కడి అడవిలోని కుందేలు "అల్లుడూ! ఆ దీపాన్ని ఎలా పడగొట్టావు?" అడిగింది ఆసక్తిగా.

'అదా! అందరూ ఆదమరిచి ఉన్నప్పుడు ఎలుకని వదిలా. అంతే!" అంది.

"అల్లుడూ! నువ్వు నిజంగా చాలా తెలివైన వాడివి" అంటూ మెచ్చుకుంది కుందేలు.

- సి.హెచ్. వి.ఎస్. బ్రహ్మానందరావు

దప్పిక తీరే దారేదీ!





అసలే వేసవి. ఆపై ప్రచండ భానుడి ప్రతాపం. ఆకలి వుండదుకానీ దప్పిక తీరదు. ఎన్ని నీళ్లు తాగినా గొంతు ఆర్చుకుపోతుంటుంది. చల్ల చల్లగా తాగాలనిపిస్తుంది. మానవమాత్రులైతే.... అదీ ఇంట్లో చల్లిపెట్టెలుంటే ...జేబులో పైసలుంటే... చల్లటి నీళ్లు తాగే ప్రాప్తం వుంటుంది. మరి మూగ జీవాల మాటేంటి! వాటికి మనలా ఫ్రిజ్జులూ, కూల్‌డ్రింకు షాపులూ, కుండలూ వుండవే. కొనుక్కోడానికి డబ్బులుండవే. మరి వాటి సంగతేంటి? ఏముంది! ఉసూరుమంటూ ఏ చెరువునో, సరస్సునో, నీటికుంటనో వెతుక్కుని గొంతు తడుపుకుని తృప్తి పడాల్సిందే. హమ్మయ్య ప్రాణం నిలిచింది చాలనుకొని వెళ్లిపోవాల్సిందే. మరి పట్టణాల్లో తిరిగే మూగ జీవాల మాటేంటి? ఇక్కడ వీధుల్లో పంపులు కూడా కనిపించవే. అవేం చేయాలి? ప్రాణాలు కడబట్టుకుని కాలం నెట్టుకురావాల్సిందేనా! అందుకేనేమో! జంతుప్రేమికులు ఈ మధ్య ఒక ఎస్సెమ్మెస్ పంపుతున్నారు. మూగజీవాలకోసం చిన్న గిన్నెలో నీళ్లు పోసి బయట పెట్టమంటున్నారు. అలాగైనా కొన్ని ప్రాణాలు కాపాడగలుగుతామని చిన్న ఆశ.